ప్రజాశక్తి

Vol. 1, no. 12

(Sept. 2, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 12

(Sept. 2, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6

PRAJA SAKTI

Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 2-9-42 బెజవాడ | సంచిక 12

జాతీయైక్యతకై ముస్లింప్రజల ఒత్తిడి

కామ్రేడ్
కంభంపాటి సత్యనారాయణ

బ్రిటిషు ప్రభుత్వం దేశంలో నిర్బంధ విధానాన్ని ప్రవేశ పెట్టి 3 వారాలు దాటినప్పటికీ ప్రజలలో అశాంతి, ప్రతీకార చర్యలు యెక్కువౌతున్నాయి గాని తగ్గడం లేదు. ఒకచోట తుపాకులు కాల్చి ప్రజలను బెదరకొడితే, మరొకచోట ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు, పట్టణాలలో సులభంగా పోలీసులు, మిలిటరీ వచ్చి ప్రజలను భీభత్సం చేస్తూంటే పల్లెటూళ్ళతో అరాచక చర్యలు అవలీలగా సాగిపోతున్నవి. ఆంధ్ర దేశంలో యిట్టి చర్యల ఉధృతం తగ్గుతూన్నప్పటికీ, యితర రాష్ట్రాలలో సాగుతూనే వున్నాయి. బీహార్, మధ్య పరగణాలు, సంయుక్త పరగణాలు, సింధు రాష్ట్రం, అరాజక చర్యలకు యెక్కువగా గురికావడంచేత అనేక ప్రదేశాలలో తుపాకులు కాల్చడం, చాలామంది హతులవడం జరిగింది.

అనేక ప్రదేశాలలో గ్రామస్థు లందరిపై సాముదాయక జరిమానాలు విధించడం కూడా ప్రభుత్వానికి పరిపాటయింది. యు. పి. లో బరాహా ప్రజలపై రు 20 వేలు, భట్వారాణి ప్రజలపై రు 75 వేలు జరిమానా విధించారు. ఘోరక్‌పూర్ జిల్లాలో అనేక ప్రదేశాలపై రు 30 వేలు జరిమానా విధించబడింది. ఒరిస్సాలో 12 గ్రామాలపై రు 6 వేలు, 4 గ్రామాలపై రు 5 వేలు విధించారు. బొంబాయి ప్రభుత్వం ఖాందేష్ జిల్లాలో ఒక గ్రామంపై రు 3 వేలు విధించింది. ఇలాగే బరోడా సంస్థానంలో 14 గ్రామాలపై రు 45 వేలు జరిమానా విధించబడింది.

రైలు పట్టాలు పీకివేయడం మొదలైన పనులుచేస్తేగాని చెయ్యడానికి ప్రయత్నిస్తేగాని, కొరడా దెబ్బలు మొదలు మరణ శిక్షవరకు విధించ వచ్చునని "పెనాల్టీస్ మూడవ సవరణ ఆర్డినెన్సు" శాసించుతోంది. లండనులో యిండియా ఆఫీసు ఒక ప్రకటన చేస్తూ, కాంగ్రెసు మంత్రుల కాలంలోనే కొరడా దెబ్బల చట్టం అమలులో వుండేదంటూ వెక్కిరించింది. నేటి అసాధారణ పరిస్థితులలో యిట్టి శాసనాలు చేయడం పోలీసులు మితిమీరి చరించడానికి ఉపయోగిస్తాయి.

బొంబాయి రాజధానిలో సమ్మెలు చేస్తున్న విద్యార్థులు సెప్టెంబరు 1 వ తేదీనుంచి విద్యా సంస్థలనుంచి తొలగించబడతారని బొంబాయి ప్రభుత్వం ప్రకటించింది,

మధుర, అహమ్మదాబాద్, క్యాలికట్ మ్యునిసిపాలిటీలు ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండించినంత మాత్రంచేతనే వాటిని ప్రభుత్వం సూపర్‌సీడ్ చేసింది. ఈ విధంగా ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్యగల వైరుధ్యం యెక్కువ అవుతోంది. ప్రజా పరిపాలన యొక్క ఆఖరు చిహ్నాలు కూడా ప్రభుత్వంచే తుడిచివేయ బడుతున్నాయి.

ఇటీవల ఇండియా ప్రభుత్వం ప్రకటించిన పత్రికా చట్టముపై అసమ్మతి తెలియజేస్తూ అన్ని రాష్ట్రాలలోను చాలా జాతీయ పత్రికలు తమ కార్యాలయాలను మూసివేశాయి. దానితో ప్రభుత్వం అఖిల భారత పత్రికా ప్రతినిధులతో సంప్రతింపులు చేసి, రూల్సులో కొన్ని మార్పులు చేసింది. శాసనోల్లంఘనోద్యమానికి సంబంధించిన వార్తలు, ఫొటోలు, బొమ్మలు, ముందుగా ప్రెస్ ఎడ్వైజర్‌కి చూపించాలి. అతడు అంగీకరిస్తే ప్రచురించాలి.

ఈ మార్పువల్ల పత్రికా స్వాతంత్ర్యం ఎలా లభిస్తుందో అర్థంకాదు. ఇదివరకు రిజిస్టర్డు విలేఖరి పంపిన వార్తలు ప్రభుత్వాధికారులచే ప్రకటించబడిన వార్తలు మాత్రమే ప్రచురించాలి; ఇప్పుడు ప్రెస్ ఎడ్వైజరు అనుమతితో ప్రచురించాలి. ప్రభుత్వంయొక్క జోక్యం వార్తలను ప్రచురించే విషయంలో ఎంతమాత్రమూ పనికిరాదు. పత్రికలన్నీ యీ రూల్సును వ్యతిరేకిస్తూ తీవ్రమైన ఆందోళన చెయ్యాలి.

ఈవిధంగా ఒకవైపు బ్రిటిషు ప్రభుత్వం నిర్బంధ విధానాన్ని యెక్కువ చేస్తూంటే; మరొకవైపున దేశంలో అన్ని చోట్ల యీ విధానంపట్ల నిరసన వ్యాపించుతోంది. బొంబాయి, బెంగాల్, మధ్య పరగణాల ట్రేడ్ యూనియన్ కాంగ్రెసులు ప్రభుత్వాన్ని ఖండిస్తూ, భారతీయులకు అధికారం స్వాధీనం చేయవలసిందనీ, నాయకులను విడుదల చేసి జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించ వలసిందనీ తీర్మానించాయి. ఎం. ఎస్. ఎం. రైల్వే కార్మికుల సంఘంకూడా యిట్టి తీర్మానమే చేసింది. జి. వి. దేశ్‌ముఖ్, జి. ఏ. ఓగ్లే మొదలైన మధ్య పరగణాల నాయకులు ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ, జాతీయ నాయకుల విడుదలను కోరుతూ, ప్రభుత్వానికి మ్యానిఫెస్టో పంపించారు.

కలకత్తాలో 30 వ్యాపార సంస్థల ప్రతినిధులు సమావేశమయి, జాతీయ ప్రభుత్వ స్థాపనకై కృషి చేయవలసిందిగా

మన రాజకీయాలు

వైస్రాయికి టెలిగ్రాం యిచ్చారు. ఇలాగే బెంగాల్ హిందూ మహాసభ జమియత్ ఉల్ ఉలేమా సంఘము, అఖిలభారత రైతు సంఘం తరపున ఇందూలాల్ యాగ్నిక్, ఇండియన్ ఛేంబర్స్ ఆఫ్ కామర్సు అధ్యక్షుడైన జి. మెహతా, పంజాబు యిండియన్ ఛేంబర్ ఆఫ్ కామర్సు, ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండిస్తూ ప్రకటనలు చేశారు. జాతీయ వాంఛను బలపరుస్తూ, జాతీయ ప్రభుత్వాన్ని వెంటనే నిర్మించాలని హెచ్చరించారు.

భారత దేశ సమస్యను పరిష్కరించి, భారతీయుల నందరినీ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో పాల్గొనేటట్లు చేయాలని విదేశాలలో కూడా ప్రజాభిప్రాయం వ్యాపించుతోంది. లండనులో జరిగిన ఇండియా లీగ్ సమావేశంలో బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెసుతో తిరిగి సంప్రతించవలెననీ, మిత్ర రాజ్యాలన్నీ భారత స్వాతంత్ర్యానికి గ్యారంటీ యివ్వాలనీ తీర్మానించింది. సాముదాయిక జరిమానాలను ఖండించింది. "భారతీయులకు కావలసిన ప్రభుత్వాన్ని నిర్మించి, దానికే భారతీయుల సమస్యలను వదలివేయడం రాజనీతి. అటువంటి రాజనీతిజ్ఞులు మనలో లేరా ?" అని న్యూస్ క్రానికల్ పత్రిక ప్రశ్నించింది. మాంచెస్టరు గార్డియన్ ఇలా వ్రాసింది: "మన మిత్రులు మనకు సహాయంచేస్తే తప్పక మనం జయిస్తాం. యిటీవల నిర్బంధింపబడినవారు కూడా అట్టి స్నేహితులే" బెర్నార్డ్‌షా ఇండియా లీగ్ మీటింగుకు సందేశం పంపుతూ, యిలా అన్నాడు. "ప్రభుత్వం భారతీయులతో చేసిన సంప్రదింపులలో ఒక పెద్ద పొరపాటుచేసింది. అందువల్ల సంభవించిన దుష్ఫలితాలను అనుభవించవలసి యుంది."

ఇలాగే బ్రిటిషు కమ్యూనిష్టుపార్టీ సెక్రటరీ బ్రిటిష్ ప్రధానికి లేఖ వ్రాస్తూ భారతప్రతినిధులతో సంప్రతింపులు చేయవలసిందని హెచ్చరించాడు. 1½ లక్షల కార్మికుల తరపున న్యూయార్క్ కార్మిక సమ్మేళనము కాంగ్రెసుకు యీ విధంగా వ్రాసింది.

" మీ వాంఛలు, మీ ఆదర్శాలు, మా ప్రజలలో ఎక్కువ సానుభూతిని సంపాదించాయి. మీయెడల మాకు గౌరవభావం వల్లనే మేము మీయొక్క రాజకీయ, సాంఘిక సమస్యలను యెక్కువ శ్రద్ధతో పరిశీలిస్తునాం. కఠినమైన మీ సమస్యలు వేగంగా పరిష్కరించబడి, మీరు స్వతంత్రజాతీయ జీవనాన్ని అనుభవించగలరని ఆశించుతున్నాము."

కొబట్టి, బ్రిటిషు ప్రభుత్వం ప్రపంచ ప్రజలను భారతీయులకు వ్యతిరేకంగా త్రిప్పజూచిన ప్రయత్నం భగ్నం అయింది. దేశంలో యెవరూ, ఏ పార్టీ, ప్రభుత్వాన్ని సమర్థించడంలేదు. అయితే జాతీయైక్యతమాత్రం లోపించియుంది. ఇది వుంటే జాతీయ ప్రభుత్వం సులభంగా లభ్యమవుతుంది,

మద్రాసు రాజధాని యొక్క ముస్లింలీగ్ కార్యదర్శి, లీగ్ తీర్మానంవల్ల సంప్రతింపులకు అవకాశం వున్నదనీ, రాజగోపాలాచారి వంటి నాయకులు, గాంధీ జిన్నాలతో రాయబారాలు సాగించవలసిందనీ, హెచ్చరించాడు. జిన్నా వెంటనే గాంధీతో సమావేశమై సంప్రతింపులు చేయవలసిందని పంజాబ్ ముస్లింలీగ్ యొక్క ఉపాధ్యక్షు డన్నాడు. ఒడంబడికకు ద్వారం తెరువబడే వుందని ఖలీఖుజమాన్ (లీగ్‌వర్కింగ్ కమిటీ సభ్యుడు) అన్నాడు. కౌన్సిల్ ఆఫ్‌స్టేట్‌లో ముస్లిం లీగ్ నాయకుడైన సయ్యద్ హుస్సేన్, లీగ్ కాంగ్రెసుతో రాజీ చేసుకోనందుకు అసమ్మతిని ప్రకటించాడు. వెంటనే లీగ్ కౌన్సిల్‌ని సమావేశపరచాలన్నాడు,

మధ్య పరగణాల ముస్లిం లీగ్ ఉపాధ్యక్షుడు అబ్బాస్‌అలీ కమల్ యిలా చెప్పాడు : "నేటి క్లిష్ట పరిస్థితిలో మనంఅంతా ఐక్యమవాలి. అభిప్రాయ భేదాలను భవిష్యత్తుకు వదలాలి" కాంగ్రెసు నాయకులు జైళ్ళలో వున్న యీ సమయంలో ముస్లింలీగ్ తరపున జిన్నా సంప్రతింపులకు ముందంజ వేయాలని అతడు హెచ్చరించాడు.

అస్సాం రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్‌కూడా, ముస్లింలీగు, కాంగ్రెసు కలిసి సంప్రతింపులను ప్రారంభించవలసిందనీ, జాతీయైక్యతద్వారా జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించవలసిందనీ, కోరుతూ జిన్నాకు, మహాత్మునికి, టెలిగ్రాములు యిచ్చారు.

బెంగాల్ రాష్ట్ర ముస్లిం సంఘము, రాష్ట్ర ముస్లిం యువజన సంఘం కూడా ముస్లిం లీగు తీర్మానం యెడల అసంతృప్తిని ప్రకటించాయి. ముస్లిం లీగు పత్రిక సహితం లీగు తీర్మానం రాజీకి ద్వారాన్ని తెరిచే వుంచిందని వ్రాసింది.

ఈ విధంగా ముస్లింలీగ్‌లోనే అనేకులు జాతీయైక్యతను కోరుతున్నారు. దేశాన్ని అరాజకానికి వదలక, జాతీయ ప్రభుత్వం ద్వారా ఫాసిజాన్ని ఎదుర్కోవాలని వాంఛిస్తున్నారు. ఇందుకు కాంగ్రెసువాదులు, ముస్లింప్రజలు, కలిసి కృషిచేయవలసి యుంది.

ప్రజాశక్తి

2-9-42 బుధవారం

దేశభక్తుల కర్తవ్యం

బ్రిటీషు సామ్రాజ్యవాదులు కాంగ్రెసును అణచివేయాలని తీవ్రనిర్బంధ విధానం ప్రయోగించారు. కాంగ్రెసు ప్రతికూలకూటమి నిర్మించాలని, ఆశించారు. కాని వారి ఆశలు నిరాశలయ్యాయి. ఏమంటే ప్రభుత్వం జాతీయనాయకుల నరెస్టు చేయుటచే రగుల్కొల్పబడిన ప్రజల ద్వేషాగ్ని మిన్నుముట్టింది. జపాను దుండగీడుల ఏజెంట్లనుండి రైల్వేలను కాపాడవలసిన ప్రజలే వాటిని పీకివేస్తున్నారు. ఫాసిస్టులను దునుమాడవలసిన చేతులు టెలిగ్రాఫ్ తీగలను తెగ్గించుతున్నాయి. దురాక్రమణదారులకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపరచవలసిన దేశభక్తులు దేశరక్షణ కార్యాలను భగ్నం చేయమని ఉద్బోధించుతున్నారు. దీనికంతకీ బ్రిటీషు సామ్రాజ్యవాదులే బాధ్యులు. వారే భారతదేశానికి నిప్పంటించారు. తద్వారా ప్రపంచ ప్రజాయుద్ధానికి ద్రోహం చేశారు.

భారతభూమి మనది. ఈ మంటలను ఆర్పుకోవలసింది, జపాను దుండగీడుల నుండి మన మాతృదేశాన్ని రక్షించుకోవలసిందీ మనమే. ప్రభుత్వ నిర్బంధ విధానం తాండవమాడుతూ, మిలటరీ లారీలు మన గ్రామాలు పట్టణాలు చుట్టు తిరుగుచున్న యీ సమయంలో చేయవలసిన ప్రథమ కర్తవ్యం ఏమిటి? జాతీయ నాయకులను విడిపించి ప్రజలమధ్యకు తీసుకురావాలి. జాతీయ నాయకులు యునైటెడ్ నేషన్సు ప్రజలతో భారతప్రజలు సహకారం చేయాలనే కోరారు. శాంతిని కాపాడడానికే నాయకులను అరెస్టు చేశామని సామ్రాజ్యవాదులు చెప్పేమాట శుద్ధ అబద్ధం. నాయకులను అరెస్టు చేయుటవల్లనే యిదివరకు ఎన్నడు జరుగనంతగా శాంతి భగ్నమయింది. సామ్రాజ్యవాదులే భారతదేశాన్ని రక్షించుతారనడం కల్ల. భారతప్రజలు సహకారం లేకుండా భారతభూమిని రక్షించడం సాధ్యంకాదు.

ఈ సత్యాన్ని ప్రతి భారతీయుడు గుర్తించి తీరుతాడు. భారత దేశం జపాన్ హస్తగతం కాకుండా వుండాలంటే జాతీయ నాయకులను విడుదల చేయాలి. దేశములో శాంతి స్థాపించబడాలి. జాతీయ నాయకులే ప్రజలకు నాయకత్వం వహించగలరు. శాంతిని కాపాడగలరు. నిరంకుశాధికారులకు ప్రజలను రెచ్చగొట్టడము మాత్రమే తెలుసు. మన దేశ రక్షణ సామ్రాజ్యవాదుల చేతకాదు. దేశ భక్తులు, జాతీయనాయకులే మాతృదేశ రక్షణను ఆర్గనైజు చేయగలరు. అందుకొరకే జాతీయ నాయకులను విడుదల చేయాలి.

భారతజాతీయ నాయకులను యింకా సామ్రాజ్యవాదుల జైళ్ళలో మగ్గనివ్వడం దేశాన్ని జపాన్ నక్కలపాలు చేయడానికి దారి తీస్తుంది. వారిని విడుదల చేయించామంటే దేశంలో శాంతి నెలకొల్పగలము. జపాన్ దుండగీడులకు వ్యతిరేకంగా జాతీయ ప్రతిఘటనను ఆర్గనైజు చేయగలము. సామ్రాజ్యవాదుల నిర్బంధ విధానాన్ని యెదిరించి ఓడించగలం. కాంగ్రెసు ప్రతికూల కూటమిని ఏర్పరచాలనే ప్రభుత్వ కుట్ర పూర్తిగా విఫలమయింది. దానికి ఫలితంగానే కాంగ్రెసుపై దాడికి ప్రోత్సహించిన సి. పి. రామస్వామయ్యర్ వైస్రాయి కౌన్సిల్‌కు రాజీనామా యిచ్చిపోవలసిన గతి పట్టింది. ఉద్యమ ప్రారంభంలో ప్రభుత్వ దాడిని యెదుర్కోడానికి కమ్యూనిష్టులు రెండు నినాదా లిచ్చారు.

కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలి. జాతీయ ప్రభుత్వం స్థాపించడానికి రాయబారాలు జరపాలి.

ఈ రెండు నినాదాలు నేడు భారత దేశంలోని ప్రతి పార్టీ, ప్రతి సంస్థచే ప్రతిధ్వనింపబడుతున్నాయి. ప్రతి దినం పత్రికలలో ప్రకటింపబడుతున్న వార్తలు రైతులు, కార్మికులు, వర్తకులు, వేయేల అన్ని వర్గాలకు చెందిన భారతీయులు అదే ఆశించుతున్నారని స్పష్టపరుస్తున్నాయి. నేడు భారత ప్రజల మందరం యేకమయి జాతీయ నాయకుల విడుదల కొరకు ఆందోళన చేయాలి. లేనిచో సామ్రాజ్యవాద నిరంకుశాధికారులు భారత జాతీయోద్యమాన్ని క్రూరంగా అణచివేస్తుంటే నిస్సహాయులవలే చూస్తూండవలసి వస్తుంది. జపాన్ ఫాసిస్టుల యేజంట్లు యీ అవకాశాన్ని వినియోగించుకోడం సులభమవుతుంది. ఆత్మహత్యాకరమైన యీ పనులు జరుగకుండా వుండాలంటే మనం వెంటనే మన కర్తవ్యాన్ని నెరవేర్చాలి.

దేశభక్తులందరూ, ప్రతి గ్రామంలో పట్టణంలో వుండే ప్రజాసంస్థలన్నీ వెంటనే కాంగ్రెసు నాయకులను విడుదలజేసి జాతీయ ప్రభుత్వము స్థాపించడానికి రాయబారాలు సాగించాలని డిమాండు చేయాలి.

జాతీయ నాయకుల విడుదలకొరకు, జాతీయ ప్రభుత్వంకొరకు ఎడతెగకుండా సభలద్వారా ఆందోళన చేయాలి.

సభలు నిషేధించబడిన ప్రదేశాలలో యింటింటికి తిరిగి ప్రజలచే పై కోర్కెలను బలపర్చుతూ వేలకొలది, లక్షలకొలదీ సంతకాలు చేయించాలి.

కాంగ్రెసు నాయకులను విడుదల చేయించడానికి మనమంతా ఏకమవుదాము. అదే జాతీయ ఐక్యతకు మొదటిమెట్టు అవుతుంది. ప్రజానాయకుల విడుదల చేయించడానికి ప్రజలనుసమీకరించుదాము. మననాయకులనువిడిపించితే జాతీయైక్యతసాధించి, జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోగల్గుతాము. మన 40 కోట్ల భారత ప్రజల బలంతో ఫాసిజాన్ని ఎదిరించి, పోరాడి, జయించి, భారతస్వాతంత్ర్యాన్ని స్థాపించగల్గుతాము.

కమ్యూనిష్టుల అరెస్టు

కమ్యూనిష్టు పార్టీ పాలసీ "ప్రజాశక్తి"ద్వారాను; అనేక సభలలో ఉపన్యాసాల ద్వారాను స్పష్టపరచ బడుతూంది. ఆంధ్రదేశమంతటా కామ్రేడ్స్ ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం గావించుతున్నారు. నేడు దేశంలో చెలరేగిన అరాచకం దేశ స్వాతంత్ర్యానికి మార్గం కాదనీ, నేటి పరిస్థితులలో జపాన్ దుండగీడులకు లాభప్రద మవుతుందనీ ప్రజలకు నచ్చచెప్పడానికి కామ్రేడ్స్ కృషి చేస్తున్నారు. ప్రభుత్వము నాయకులను అకారణంగా అరెస్టు చేయుటచే రెచ్చగొట్టబడిన ప్రజలు అరాచక వాదులను అనుసరించకుండా ఆపడానికి, పాలకొల్లు, భీమవరం, తెనాలి, రేపల్లె, పల్లెకోన, గుంటూరు, చల్లపల్లి, కాకినాడ, రాజమండ్రి, విజయనగరం వగైరా అనేక ప్రాంతాలలో ప్రయత్నించారు. కొన్నిచోట్ల విఫలులైనా, కొన్నిచోట్ల అరాచక పరిస్థితులు యేర్పడకుండా ఆపగల్గారు. కాని నిరంకుశాధికారం అమలు జరుపుతున్న పోలీసు అధికారులకు కండ్లు మూసుకుపోయాయి. విచక్షణాజ్ఞానం వారిలో నసించింది. అనేకమంది అనవసరంగా అరెస్టు చేయబడుతున్నారు. అరాచక సంఘటనలు జరిగాయి గాన ప్రతి చోట యెక్కువమందిని అరెస్టు చేసి, లాఠీచార్జీ చేసి, లాకప్‌లో కొట్టి, కేసులు బనాయించడమే తన డ్యూటీ అయినట్లుగా భావించుతున్నటుల కాన్పించుతూంది.

ఆ విధంగా ఆంధ్రదేశంలో అప్పుడే 18 మంది కామ్రేడ్సు అరెస్టు చేయబడ్డారు. ఇలాగే యింకెంతమంది ప్రజలు అకారణంగా యీ కేసులలో కుక్కబడుతున్నారో మాకు తెలియదు. ఏమైనా పోలీసులు నేడు తమ అధికారాలను దుర్వినియోగ పరుస్తున్నారనుట స్పష్టం.

ప్రభుత్వం వెంటనే కండ్లుతెరచి యీ పోలీసు చర్యలను అరికట్టాలి. నాయకులను అరెస్టు చేయుటవల్లనే దేశశాంతి ఏ విధంగా భగ్నమయిందో ఒకసారి మనం చేసికొంటే నేడు పోలీసు లమలుజరుపుతున్న అక్రమచర్యలు ఎలా ప్రభుత్వంపై మరింత ద్వేషానికీ, మరింత అరాచకానికీ దారి తీస్తాయో స్పష్టపడుతుంది. ప్రభుత్వం వెంటనే పోలీసు అధికారులు హద్దులలో ప్రవర్తించునట్లు చేయాలనీ, కమ్యూనిస్టులపై ఫాసిస్టు వ్యతిరేకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలనీ హెచ్చరించుతున్నాము.

బోల్షివిక్ పోటీ

జులై నెలాఖరుకు 3 వేల కాపీలు అచ్చువేసే "ప్రజాశక్తి" ఆగస్టు నెలాఖరుకు 3500 వందలకు పెరిగింది. జూలై నెలలో చేసిన హెచ్చరిక ననుసరించి కామ్రేడ్స్ ఉత్సాహంతో పనిచేసినందుకు అభివందనాలు; కాని బోల్షివిక్కు కృషికి అది చాలదు. మన పత్రికకు నెలకు అయ్యే ఖర్చులో దాదాపు మూడువంతులు ఒక్క కాగితమే మ్రింగుతోంది. కాగితానికి నెలకు 600 అవుతోంది. ప్రింటింగు పోస్టేజి కలిపి నెలకి 250 మిగతా ఆఫీసు ఖర్చులు, (సంపాదకవర్గంతో సహా) రు 150 లు అవుతున్నాయి. అంటే నెలకు రు 1000 లు కావలసి వస్తోంది. అందుచే మన పత్రిక స్వయంపోషకంగా వుండాలంటే మనకయ్యే ఖర్చులు ప్రజాసానుభూతి వల్లనే అంటే చందాదారుల వల్లనే—భర్తీ కావాలి. అందుకు కామ్రేడ్స్ ఎక్కువ పట్టుదలతో, ద్విగుణీకృతోత్సాహంతో పని చేయాలి.


రాజకీయంగా నేడు మనదేశం మూసలోపడి మరుగుతోంది. ఇట్టి పరిస్థితిలో సరియైన జాతీయపాలసీ యైన మన కమ్యూనిస్టు పాలసీని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసి వారిని ఈ ప్రజాస్వాతంత్ర్యయుద్ధంలో సంఘటిత పర్చాలి. మన పత్రిక ద్వారా నిస్సందేహంగా మనం ఆపని చేయగలం; చేదాం.

కామ్రేడ్స్: బోల్షివిక్ పోటీతో పనిచేయండి. మీమీ కోటాలను మించి చందాదార్లను చేర్పించండి. పార్టీ పత్రికను నిలబెట్టుకోండి. చిరస్థాయిగా చేసుకోండి. ఆంధ్రదేశంలో ప్రతి మారుమూలకు మన పత్రిక వెళ్ళేటట్లు చేయండి. లెనిన్—స్టాలిన్‌ల పార్టీసభ్యుల కిదొక లెఖ్కలోది కాదని రుజువు చేయండి.

జిల్లా	31-8-42 వరకు చందాదారులు	విడి కాపీలు	మొత్తం	అక్టోబరు నెలాఖరుకు చేర్పించ వలసిన చందా కోటా
వైజాగ్	6	60	66	10
తూ॥ గోదావరి	13	211	224	20
ప॥ గోదావరి	135	220	355	190
కృష్ణా	805	468	1273	150
గుంటూరు	314	438	752	75
నెల్లూరు	181	92	273	75
చిత్తూరు	8	38	46	10
కడప	7	22	29	10
కర్నూలు	19	76	95	20
అనంతపూర్	6	40	46	10
నైజాం	38	74	112	20
మద్రాసు	5	10	15	
ఇతర రాష్ట్రాలు	26	188	214	
	1563	1937	3500	500

భారతీయులు ఐక్యంకాగలరు ఐక్యమయితీరాలి!

కామ్రేడ్ బి. టి. రణదేవ్



[క్రిందటివారం ముస్లిలీంగు తీర్మానంపై ప్రజాశక్తిలో ప్రకటించబడిన వ్యాఖ్యానం అసమగ్రంగావుంది. అందుచే కామ్రేడ్ రణదేవ్ ఆ సమస్యపై వ్రాసినవ్యాసం యీసారి ప్రకటించు తున్నాం. పాఠకులు యిదే మా పార్టీ పాలసీగా గుర్తించాలని ప్రార్థన.]

ఆలిండియా ముస్లింలీగు వర్కింగుకమిటీ తీర్మానం మన జాతీయవాదులందరికీ నిరాశను కలిగించింది. ముస్లింలీగు తిరిగి తన పాకిస్థాన్ పాటనేపాడిందనీ, రాజీ కుదరకుండా తలుపులు బిడాయించుకుందనీ చాలామంది అభిప్రాయం. దీనినే జాతీయపత్రికలన్నీ ప్రతిధ్వనించాయి. దీనిలో ఆశ్చర్యపడవలసిన దేమీలేదు.

భారతదేశాన్ని అతి క్లిష్టమైన రాజకీయ సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో ఈ ముస్లింలీగ్ వర్కింగుకమిటీ సమావేశం జరిగింది. ఒకప్రక్క మన దేశంపై ఫాసిస్టు దండయాత్ర నానాటికి మూసుకువస్తోంది. మన ప్రియమైన గృహాలు, కోట్లకొలది ప్రజల ప్రాణాలు నాశనమయ్యే ప్రమాదం ఎక్కువ అవుతోంది. మరోప్రక్క పిచ్చి నిరంకుశ విధానం నిరపరాధులగు ప్రజలను కాల్చి చంపుతోంది. కాంగ్రెసు సంస్థను నిషేధించింది. నాయకులను బంధించింది. ప్రజలు వెర్రి ఆవేశంతో ఈ విధానానికి పంచమాంగదళ చర్యలకి ఎరవై రెచ్చుతున్నారు, ఇంతకంటె విషమావస్థ మరి వుండబోదు.

ముస్లింలీగు ఈ సామ్రాజ్యవాద నిర్బంధ విధానాన్ని ఖండించుతుందని ప్రజలు ఆశించారు. కాని వారి ఆశ నిరాశ అయింది.

మరియొకసారి, కాంగ్రెసు హిందువుల అధికారాన్ని నెలకొల్ప పూనుకున్న "హిందూ" సంస్థ అని నిందింపబడింది. దేశంలో జరిగే కాల్పులు, ఈ గందరగోళం ముస్లిం ప్రజల సంస్థఅని చెప్పుకునే ముస్లింలీగుకు ఏమీ సంబంధం లేని విషయాలుగా త్రోసివేయబడ్డాయి.

ప్రతి దేశభక్తుని సామాన్య కర్తవ్యమైన ఈపనిని ముస్లింలీగు గుర్తించకపోవడంచూచి జాతీయవాదులు ఇలా ప్రశ్నించుతారు. దేశంలో ఇన్నిచోట్ల ప్రజారక్తం ప్రవహించుతూంటే కూడా ముస్లింలీగు చలించడంలేదే. ఇక మన దేశంలో ఐక్యత కుదిరేమార్గం మరిలేదా? అయితే మరి మనకు స్వరాజ్యం వచ్చిన తరువాతనే హిందూముస్లిం ఐక్యత వస్తుందని గాంధీజీ చెప్పేది సరియేకదా?

ఒక అడుగు ముందుకి

సామాన్య ముస్లింలీగు ప్రజాస్వామిక హక్కుల కోసం కూడ ముందుకు రాకపోవడం చూస్తే ఆలా అనిపించేమాటనిజమే. కాని లీగు తీర్మానాన్ని కనక నిష్పాక్షిక దృష్టితో తరచి చూస్తే, దేశంలో జరిగే సంఘటనల పట్ల అది ఉదాసీనత వహించలేదని తెలుస్తుంది. దేశంలో జరిగే ఈ తీవ్ర నిర్బంధ విధానం ముస్లింలీగును తాను చెప్పేది "అంగీకరిస్తారా లేదా" అనే పీఠంనుంచి క్రిందికి దించింది. వెంటనే కాంగ్రెసుతో రాజీ కుదుర్చుకునే మార్గాలకోసం అన్వేషించేటట్లు చేసింది.

అడ్డంకులు

కాంగ్రెసు - ముస్లింలీగుల ఐక్యతకు అడ్డంకులుగా వుండే వాటిని మనస్సులో పెట్టుకుంటే పైవిషయం స్పష్టమవు తుంది.

మొదటి విషయం రెండు సంస్థలనూ ప్రతిష్ట ఏడిపించుతోంది. జిన్నా పదే పదే, కాంగ్రెసును హిందూ సంస్థయని అంగీకరించమంటూ తన మొండివాదనను కాంగ్రెసు ముందు పెడుతూనేవచ్చాడు. దీనిని కాంగ్రెసు అంగీకరించ జాలదు. మొన్నటిలీగు వర్కింగు కమిటీ తన తీర్మానంలో అలాంటి అర్థంలేని షరతులు పెట్టలేదు. తీర్మానంలో ఇలావుంది.

"సమానత్వ సిద్ధాంతంపై, తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి ఏసూచనలనైనా సరే ఆలోచించ డానికి, ఏ పార్టీతోనైనాసరే రాయబారం చేయడానికి, ముస్లింలీగు ఇది వరకూ ఇప్పుడూ కూడా సిద్ధంగా నే వుంది"

దీనిని బట్టి ముస్లింలీగు కోరేదంతా తనకు సమాన ప్రతిష్టను ఇవ్వాలని సంయుక్త జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించ డానికి అంగీకరించిన కాంగ్రెసు. ఈ కోరికను అంగీకరించవచ్చు. అదీగాక, లీగు ఈ రోజున తనకు సగానికి సగం పదవులు కావాలనే నినాదం వదలిపెట్టి ఏ సూచనలనైనా చర్చించ డానికి అంగీకరించుతోంది. ఇది గమనించవలసిన సూచనయే.

అధికారాలు

అధికారం భారతీయులకు హస్తగతం చెయ్యాలనే సమస్య పై క్రిప్సు రాయబారాలప్పుడు, ముస్లింల హక్కులను కాపాడడానికి వైస్రాయి ప్రత్యేకాధికారాలను వినియోగించాలని లీగు ప్రతినిధులు కోరారని వినికిడి. మొన్నటి బొంబాయి అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశంలోకూడ నెహ్రూ ఈదృక్పథాన్ని వ్యతిరేకించుతూ, సామ్రాజ్యవాదుల అండ నుండగోరేవారితో మనకు రాజీ ఎలా కుదురుతుంది అని అడిగాడు.

కాంగ్రెసు - లీగు ఐక్యతకిది నిజంగా పెద్ద అడ్డంకే. కాని నెహ్రూకు సమాధానం ఇస్తూ జిన్నా ఈ వార్త వట్టి అబద్ధమని చెప్పాడు, లీగు వర్కింగుకమిటీ తీర్మానంపై తన స్టేటుమెంటులోకూడా ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పాడు.

లీగు తీర్మానంలో ఇలావుంది.

"దేశరక్షణకోసం దేశంలోని సాధన సంపత్తిని సమీకరించడానికి, విజయవంతమైన యుద్ధ ప్రయత్నాలకుగాను, దేశమంతటా తాత్కాలిక ప్రభుత్వాల నేర్పరచడానికి, ముస్లింలీగుకు సమాన హోదాను అంగీకరించేయెడల, ఏపార్టీతోనైనా, ఏ సూచనలనైనా చర్చించ డానికి, లీగు సిద్ధంగా వుంది" అని వుంది.

తీర్మానంలోని ఈభాగంపై వ్యాఖ్యానం చేస్తూ పత్రికా ప్రతినిధుల సమావేశంలో జిన్నా ఇలా అన్నాడు. "ఈ తాత్కాలిక ప్రభుత్వాలకు ఇచ్చే అధికారాలు ఇంతే అని హద్దు వుండడానికి వీలులేదు. అది మన రాయబారాలపై ఆధారపడివుంది."

దీని అర్థం స్పష్టమే. కాంగ్రెసు లీగు ఐక్యత కుదిరిననాడు, సంపూర్ణాధికారాలతో కూడిన జాతీయప్రభుత్వాన్ని కావాలని కోరడంలోను, వైస్రాయి తన ప్రత్యేకాధికారాలను వినియోగించకుండా చేయడానికి సామ్రాజ్యవాద నిరంకుశ ప్రభుత్వం చేతులలోనుండి అధికారాన్ని గుంజుకోడానికి ముస్లింలీగు మనతో కలసి వస్తుందన్నమాట. వైస్రాయి ప్రత్యేకాధికారాలచే అడ్డగింపబడకుండా మన దేశరక్షణను స్వతంత్రంగా ఆర్గనైజు చేసుకోడానికి, సంపూర్ణాధికారాలతో కూడిన ప్రజాప్రతినిధుల ప్రభుత్వమే నేడు మనకు కావాలి, జాతీయకాంగ్రెసు కోరేదికూడ అదే. దీనికి ముస్లింలీగుకూడ అంగీకరిస్తోంది. ఐక్యత కొరకు సంప్రదింపులు జరగాలని కోరుతోంది. అంటే జాతీయ ఐక్యతకు అడ్డం వస్తున్న రెండవ ప్రతిబంధకాన్నికూడ మనం దాటామన్నమాట. అటువంటప్పుడు మనకు వుండవలసినది నిరాశకాదు. ఆశ, మరింత దృఢ విశ్వాసం.

మూడో ప్రతిబంధకం

ముస్లింలీగు పాకిస్థాన్ నే కోరుతోంది. గాని సంపూర్ణస్వాతంత్ర్యం దానిలక్ష్యం కాదని కాంగ్రెసుకు అపనమ్మకం. ప్రతి రోజూ సామ్రాజ్యవాద ప్రభుత్వంచేసే అబద్ధప్రచారం ఏమంటే సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనేది ఒక్క కాంగ్రెసుయొక్క వాంఛయేననీ, ముస్లింలీగుకు ఆకోరికతో సంబంధం లేదని.

ఈ మధ్యలీగు చేసిన తీర్మానం ప్రభుత్వపు ఈ అబద్ధప్రచారాన్ని బట్టబయలు చేసింది. అదీగాక మంచి సమయంలో, కాంగ్రెసుపై ప్రభుత్వం దుష్ప్రచారాన్ని సాగించిన సమయం, లోలీగు ఈ పనిచేసింది. జాతీయైక్యత తప్పకసాధ్యమౌతుందని లీగు తీర్మానం చూపుతోంది. ఆతీర్మానంలో ఇలావుంది.

"ముస్లింలీగు ఒక్క పాకిస్థాన్ కు, ముస్లిము ప్రజల స్వాతంత్ర్యానికే కాకుండా, హిందువుల యొక్క హిందూస్థాన్ యొక్క స్వాతంత్ర్యాన్ని కూడా కోరుతుంది". దీని అర్థం లీగుమరోసారి, తాను సంపూర్ణ స్వాతంత్ర్యానికి, జాతీయైక్యతకు సంసిద్ధమేనని వాగ్దానం చేస్తోంది.

పాకిస్థాన్

లీగు తీర్మానం పట్ల జాతీయ వాదులలో అసంతృప్తికి కారణం అది అస్తమానమూ పాకిస్థాన్ కావాలని పట్టుదల వహించడమే.

పాకిస్థాన్ అంటే దేశాన్ని ముక్కలు ముక్కలుగా విడ దీయడం అసంభవం. ఇది జాతీయ వాదుల దృక్పథం. దీనిపై మనకు ఐక్యత కుదరదు అని వీరి నినాదం.

లీగు పదేపదే పాకిస్థాన్ కావాలని కోరుతోందన్నంత మాత్రాన గాభరాపడి గంతులు వేసే వారికి జాతీయైక్యత అంటే గాని, అట్టి ఐక్యత వల్ల కాంగ్రెసు వైఖరిగాని ఏమీతెలియదని చెప్పాలి.

పాకిస్థాన్ కోరికలోని అభివృద్ధి కరమైన విషయం ఏమిటి? అది, స్వయం నిర్ణయ సూత్రాన్ని మన దేశంలోని కొన్ని జాతులకు అన్వయింప జేయడం. కొన్ని ప్రాంతాలలో ముస్లిములు, ప్రత్యేక విజ్ఞానం, చరిత్ర, అనుసృత ఆచారము గలిగి ఒక ప్రత్యేక జాతిగా ఏర్పడిన మాటవాస్తవం, న్యాయ దృష్టితో చూస్తేవారికి వారిజీవితాన్ని, వారి విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోడానికి గాను వారు కోరినప్పుడు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే హక్కు వుండాలి, జాతులకు అట్టి విడిపోయే స్వాతంత్ర్యం ఇచ్చే హక్కు అంగీకరించకపోతే భారత దేశంలో ఐక్యత నిర్మింపబడిజాలదు.

అప్పుడు ముస్లింలీగు తనకోరికను మానుకుంటుందా లేదా అన్నది కాదు ప్రశ్న. అప్పుడు ముస్లింలీగు న్యాయమైన అభివృద్ధికరమైన కోర్కెను పెట్టి జాతీయ ఐక్యతను సులభసాధ్యం చేస్తుందా లేదా అనేది కావాలి. ఈ విషయమై లీగు నిజంగా ఒక అడుగు ముందుకువేసిం దనడంలో సందేహంలేదు.

ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్యమైన విషయం, లీగు ఈరోజుననే నిలుచున్నపాళంగా పాకిస్థాన్ కావాలని కోరడంలేదు. యుద్ధానంతరంవరకు దానిని తలపెట్టకుండా వుండటానికి తయారయింది. ఇప్పుడది కోరేదల్లా అట్టి స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించమనియే. అదంతా ముస్లింప్రజల ప్లెబిసైట్ (ఓటు)ను బట్టియే నిర్ణయించవచ్చునని అంటోంది, అంటే ఈ సమస్యను నిర్ణయించే అధికారం సామాన్య ముస్లిం ప్రజలకు వదలివేసింది. ప్లెబిసైట్‌ను తీసుకొని దానిప్రకారం నిర్ణయించవచ్చుననడంలో ముస్లింలీగు చక్కని ప్రజాస్వామ్య మార్గాన్ని అవలంబించింది. దీనివలన జాతీయవాదులకు, ముస్లిం ప్రజలను ఈ విడిపోయే హక్కును అమలు జరపవద్దని ఒప్పించడానికి కావలసినంత వ్యవధి ఏర్పడుతుంది; ఇంతకంటె చక్కని అవకాశాన్ని లీగ్ మనకు ఇస్తుందని ఆశించలేము.

ముస్లిము ప్రాంతాలను నిర్వచించడంలో గూడ లీగ్ సరియైన విధానానికే వస్తోంది. లీగ్ తీర్మానంలో ఇలావుంది.

"ముస్లిములు మెజారిటీగా వుండి వారి నివాసస్థానములైన ప్రదేశాలలో ప్రత్యేకరాష్ట్రాలను ఏర్పరచుకునే హక్కుండాలి."

ఈ ప్రత్యేకరాష్ట్రాలు ప్లెబిసైట్‌వల్లనే నిర్ణయింపబడాలనడం మూలాన అట్లు నిర్ణయింపబడే రాష్ట్రాలు ఇప్పటి బ్రిటిషు రాష్ట్రాలుగానే వుంటాయనేందుకు వీలులేదు.

"డైలీహెరాల్డు" పత్రికా ప్రతినిధితో మాట్లాడుతూ జిన్నా ఈ రాష్ట్రాల పునర్నిర్మాణం అవుసరమౌతుందనే చెప్పాడు.

ఏది ఏమైనప్పటికీ రాయబారాలలో ఆ విషయం చర్చించవచ్చు. కమ్యూనిస్టుపార్టీ సూచించిన పద్ధతుల పై సమంజసమైన పరిష్కారం జరగగలదనే సూచనలు కనబడుతున్నాయి.

పరిష్కారం

ముస్లింలీగ్ చేసిన ఈ సూచనలు ప్లెబిసైట్‌కు అంగీకరించడం ముస్లిం రాష్ట్రాల నిర్వచనం కాంగ్రెసు మిత్రులను సంతృప్తిపరచగలవని అనుకుంటాను. అఖిలభారతకాంగ్రెసు కమిటీ బొంబాయి సమావేశపు తీర్మానంలో ఫెడరేటింగు యూని (తరువాయి 8 వ పేజీలో)

(తరువాయి 8 వ పేజీలో)

★ ఇండియాకు
పామీదత్తు సందేశం

నేటి ప్రమాదసమయంలో, బ్రిటిషు రాజకీయ నాయకులు, భారత రాజకీయ నాయకులు నెరవేర్చవలసిన బాధ్యత ఎంతైనా వుంది. భారతదేశములో యేర్పడిన సంక్షోభము, సంఘర్షణ, బ్రిటిష్ ప్రజాతంత్రవాదులందరినీ కంపింపజేస్తున్నాయి. మీ పత్రికాసంపాదకుడు కోరిన కోరికపై భారత ప్రజలకొక సందేశం పంపడానికి అవకాశం కలిగింది. ఇండియా, బ్రిటన్ దేశాలమధ్య గల సంబంధం నేడొక ప్రమాదదశకు వచ్చింది. భారత స్వాతంత్ర్యాన్ని, ఫాసిజంపై అంతిమ విజయాన్ని కోరుతూ, నేటి క్లిష్ట సమస్యను యీరెండింటి మూలాధారంపైననే పరిష్కరించాలని అభిలషించే బ్రిటిషు కార్మిక వర్గం తరపున, ప్రజాతంత్రవాదుల తరపున, నేను యీ సందేశాన్ని పంపుతున్నాను. ప్రజాపోరాటాన్ని స్వాతంత్ర్యంవైపు నడిపించేవారు యీ క్లిష్టసమయంలో, యీ యుద్ధ ప్రమాదంలో, తమపైగల ప్రత్యేక బాధ్యతను గుర్తించాలి. అక్షరాజ్యాలు ప్రపంచమందంతట ఫాసిజం స్థాపించి తమ విజయపతాకాన్ని ఎగురవేయకుండా అరికట్టాలి. సోవియట్ యూనియన్‌మీద చైనా ప్రజలమీద ఫాసిస్టు రాక్షసులు తమ సేనలనన్నింటినీ ఒడ్డుతున్నారు. సైబీరియామీద, ఇండియామీద, దుముకడానికి పొంచియున్నారు. తమకుగల మిలిటరీ బలంతో వేగంగా విజయాన్ని సంపాదించి ప్రపంచాధిపత్యం వహించాలనీ, ప్రపంచ స్వేచ్ఛను అణచివేయాలనీ, అన్ని దేశాల స్వాతంత్ర్య పిపాసను దగ్ధం చెయ్యాలనీ, సోషలిజాన్ని ప్రపంచంనుంచి రూపుమాపాలనీ, ప్రపంచ కష్టజీవులందరినీ శాశ్వతమైన బానిసత్వంలో బంధించివేయాలనీ, ఫాసిస్టుల ఉద్దేశం.

భారత స్వాతంత్ర్యం :
ఫాసిస్టుల వినాశనం

ఈ ప్రమాదం జరుగకుండా కాపాడేది ప్రపంచప్రజలందరియొక్క ఐక్యత, స్వాతంత్ర్యాభిలాషులందరియొక్క ఐక్యత. భారతదేశ స్వాతంత్ర్యానికీ, ఫాసిస్టు వినాశనానికీ, అవినాభావ సంబంధం వుంది. భారతనాయకులలో అగ్రగణ్యుల అభిప్రాయం తీసుకొన్నా, జాతీయ కాంగ్రెసుయొక్క తీర్మానం చూచినా, నెహ్రూయొక్క ఇతరనాయకులయొక్క ఉపన్యాసాలు విన్నా, భారత జాతీయోద్యమపు ఫాసిస్టు వ్యతిరేక చరిత్రను పరిశీలించినా, ఇదే యదార్థమని తెలుస్తుంది.

ఇండియాలో ప్రజలందరూ కోరే జాతీయ వాంఛను మేము పూర్తిగా అర్థంచేసుకున్నాం. దానిని మేము బలపర్చుతున్నాం. ఫాసిజాన్ని ప్రతిఘటించడానికి ప్రజలందరినీ సమీకరించాలంటే, బాధ్యతాయుతమైన జాతీయప్రభుత్వం అవసరమనీ, ప్రజల నాయకులే దానిని నడపాలనీ, ఆనాయకులు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నవారై యుండాలనీ, అప్పుడు భారతదేశం మిత్రరాజ్యాలతో మైత్రిని కలిగియుండి యుద్ధ నిర్వహణకు మిత్రరాజ్యాలన్నింటికీ ప్రాతినిధ్యం వహించే సుప్రీం మిలిటరీ కమాండ్‌ను పూర్తిగా అంగీకరించగలదనీ, మేము గుర్తించుతున్నాం.

మీ సందిగ్ధావస్థ

అనేకమంది భారతదేశ భక్తులు, ప్రజాతంత్రవాదులు, ఫాసిస్టు వ్యతిరేకులు, ఎంత సందిగ్ధావస్థలో పడ్డారో మేము అర్థం చేసుకొనగలుగుతున్నాం. నేటి పరిపాలకులు తమ జాతీయవాంఛను నిరాకరించుతూండడం వల్ల ఇండియాలో జాతీయ విచ్ఛిన్నం, సంఘర్షణలు, సంభవించే మార్గాన్ని తప్ప మరొక మార్గం ఎందువల్ల అనుసరింపజాలకున్నారో మేము ఊహించగలం. అయితే ఆ మార్గం తప్పుమార్గమనీ, దాన్ని అనుసరిస్తే ఫాసిజం యొక్క చేతులలో పడటం జరుగుతుందనీ, అందువల్ల భారత స్వాతంత్ర్యానికీ, ఫాసిస్టు వినాశనానికీ, ఆమార్గం తోడ్పడదనీ, మా విశ్వాసం.

మీ దేశంలో నేడు జరుగుతూన్న ఘర్షణను పురిగొల్పిన పనులు, విధానాలు, విని మేమంతా దుఃఖిస్తున్నాం. బ్రిటీష్ ప్రజలకు **భారతీయులకు, మధ్య ప్రపంచప్రజలందరిమధ్య విస్తారమైన ఐక్యత, సహకారం ఉండి, అందరూ కలిసి ఫాసిజాన్ని రూపుమాపవలసిన ఈసమయంలో ఘర్షణను పురిగొల్పడం అనుచితమైన** పని. ఫాసిస్టు వ్యతిరేక శక్తులలో ఐక్యత లేనప్పుడే ఫాసిజం జయించుతుంది. ఈపోరాటంలో బ్రిటిషుప్రజల శ్రేయస్సు, భారతీయుల శ్రేయస్సు, పూర్తిగా కలిసిఉన్నాయి. రెండు దేశాల ప్రజలు అన్యోన్య సహకారంకొరకు మార్గం వెతకడం అసాధ్యమైన పనిగాదు. వెతకవలసియుంది.

బ్రిటిష్ ప్రజాతంత్రవాదుల కర్తవ్యం

అన్నింటికంటె ప్రధానమైన దేమంటే బ్రిటన్‌లో వుండే ప్రజాతంత్రవాదులు ఇండియాలో తమ మిత్రులతోను, కామ్రేడ్స్‌తోను, సహకారం చేస్తూ తమ బాధ్యతను ఎలా నెరవేర్చవలసియుందో మేము గుర్తించుతున్నాం. భారతదేశ సమస్యను పరిష్కరించడంలోను, అట్టి పరిష్కారం సాధ్యమయ్యేలాగు మేము మా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ప్రస్తుత విధానాన్ని మార్పుచేయించడంలోను, మా శక్తివంచన లేకుండా కృషిచేస్తాం. ఇలాగే ఇండియాలో కూడా ప్రజాతంత్రవాదులు, ఫాసిస్టు వ్యతిరేక శక్తులు, దూరదృష్టి గల దేశభక్తులు కలిసి భారతజాతీయోద్యమం యొక్క విధానాన్ని మార్పుచేయించి, భారతదేశ సమస్యను పరిష్కరించడంలో సహాయపడవలసియుంది.

ఇండియాలో నేడేర్పడిన పరిస్థితి ఎంత క్లిష్టమై సంక్షోభాన్ని కలిగించేది అయినప్పటికీ సమస్యా పరిష్కారానికి మార్గం వెతకవలసిన అవసరం వుంది. అప్పుడే ఫాసిజాన్ని ఓడించడానికి బ్రహ్మాండమైన భారతజాతి యితర మిత్రరాజ్యాలతో వైభవంగా సహకారం చెయ్యడం, స్వేచ్ఛతోను - ఆత్మగౌరవంతోను ఇండియా మిత్రరాజ్యాలతో చేయిచేయి కలిపి ఒకే గమ్యస్థానానికి ఉత్సాహంతో వెళ్ళడం, సాధ్యమౌతుంది. ఇది భారతీయ ప్రజల శ్రేయస్సుకు, బ్రిటిషు ప్రజల శ్రేయస్సుకు కూడా తోడ్పడుతుంది.



భారతీయులకు సానుభూతి

బ్రిటన్‌లో అభివృద్ధిని కోరే ప్రజాతంత్ర శక్తులు అంతకంతకు విరివిగా యీ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో తమ పలుకుబడినంతటినీ, వినియోగించుచున్నారు. మే నెల 25 వ తేదీని బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ యొక్క జాతీయ మహాసభలో యీ విధంగా తీర్మానించబడింది. "40 కోట్లమంది భారతీయుల సహకారాన్ని పొంది అందరము కలిసి యీ పోరాటంలో పాల్గొనాలంటే, భారతదేశ స్వాతంత్ర్యాన్ని మనం గుర్తించి తీరాలి. ఇతర మిత్రరాజ్యాలతో ఇండియాకు సమానహోదాను యివ్వాలి. సంపూర్ణాధికారం గలిగిన జాతీయ ప్రభుత్వాన్ని యేర్పరచడానికి సంప్రదింపులు వెంటనే ప్రారంభించబడాలి. భారతదేశపు శ్రేయస్సుకొరకు, ఫాసిజాన్ని నాశనం చేయడానికి, భారతీయులు ఇష్టపూర్వకముగా ఏయే నిబంధనలకు అంగీకరించుతారో అవి తప్ప మిగతా అధికారాలవిషయంలో భారతజాతీయ ప్రభుత్వం సర్వహక్కులను గలిగి వుండాలి". ఈతీర్మానానుసారం బ్రిటన్‌లో వున్న 50,000 మంది కమ్యూనిస్టుపార్టీ సభ్యులు దేశం అంతటా బ్రహ్మాండమైన ఆందోళన చేస్తున్నారు.

మాతీర్మానంలో పేర్కొనబడిన కోర్కెను దేశంలో అన్నిమూలల బ్రిటిషుప్రజలు బలపర్చుతూ, పెద్ద పెద్ద ప్రదర్శనాలు జరుపుచున్నారు. ఉదాహరణకు, మే 25 వ తారీఖున జులై 26 న, లండన్ ట్రఫాల్గర్‌స్క్వేర్‌లో బ్రహ్మాండమైన ప్రదర్శనాలు జరిగాయి. అక్కడ సమావేశ (మిగతా 5వ పేజి)

అమెరీని తొలగించాలి!
చర్చిల్‌కు బ్రిటిష్ కమ్యూనిస్టు కార్యదర్శి లేఖ

ఈనెల 24 వ తారీఖున బ్రిటిషు కమ్యూనిస్టు పార్టీ తరపున పార్టీ కార్యదర్శి హారీ పాలిట్ యొక్క సంతకంతో, బ్రిటిష్ ప్రధాని చర్చిల్‌కి ఒక లేఖ పంపబడింది. అందులో "భారత దేశపు పరిస్థితులపై యీ దేశం (బ్రిటన్)లో అధికసంఖ్యాక ప్రజలు ఆందోళన చెందియున్నారు"ని తెలియచేయబడింది. అక్షరాజ్యాల దురాక్రమణను ఆయుధాలతో యెదుర్కొనడానికి కాంగ్రెసుసంస్థ తీర్మానించి యున్నదని ఆ లేఖలో కమ్యూనిస్టుపార్టీ స్పష్టీకరించింది. శాసనోల్లంఘనం చేయడం గురించి ఇలా వ్యాఖ్యానించబడింది. "అట్టి విధానంవల్ల జాతీయ విచ్ఛిన్నం, అంతర్యుద్ధం, తప్పనిసరిగా సంభవిస్తాయి. సమీపంలోనే పొంచియున్న ఫాసిస్టు దురాక్రమణదారుల చేతులలో పడిపోవడమే అప్పుడు జరుగుతుంది. భారతదేశ స్వాతంత్ర్యానికే గాక, ప్రపంచప్రజల స్వాతంత్ర్యానికి కూడా అట్టి విధానం నాశనకారి అని మా వుద్దేశం.

కాబట్టి, వెంటనే బ్రిటిషుప్రభుత్వం ఎట్టి షరతులను కోరకుండా, కాంగ్రెసుతోను, యితర రాజకీయ పార్టీలన్నిటితోను, సంప్రతింపులను తిరిగి ప్రారంభించవలసినదని" బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ కోరుతూ, యీ క్రింది కార్యక్రమాన్ని అమలు జరపవలసిందిగా హెచ్చరించింది.

1. భారతదేశ స్వాతంత్ర్యాన్ని గుర్తిందాలి.

2. ఆయుధ సహితంగా ఇండియాను రక్షించుకోవడానికి తయారుగా వున్న పార్టీల ప్రతినిధులతో కలిసి జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించాలి. అట్టి తాత్కాలికప్రభుత్వంలో ఏ పార్టీకి ఎన్నెన్నిస్థానాలు వుండాలనే సమస్య సంప్రతింపులలోనే పరిష్కరించబడాలి. అట్టి ప్రభుత్వంలో ఏ ఒక్క పార్టీకి పటి అధికారం ఉండకూడదు. ఎందువల్లనంటే, ఆ అధికారం వుంటే పరిపాలనలో పాల్గొనకుండా ఆటంకాలు కల్పించవచ్చు.



కామ్రేడ్ హారీ పాలిట్.

3. అట్టి తాత్కాలిక జాతీయప్రభుత్వానికీ, మిత్రరాజ్యాల తరపున బ్రిటిషుప్రభుత్వానికీ, మధ్య సంధిపత్రంపై సంతకాలు జరగాలి. అందులో, మిత్రరాజ్యాలన్నింటికీ ఒక సుప్రీమ్ యుద్ధకౌన్సిల్ ఉంటాయనీ, జాతీయ ప్రభుత్వం యీ సుప్రీమ్ యుద్ధకౌన్సిల్‌కి యుద్ధనిర్వహణలో సర్వవిధాల తోడ్పడతాం అనీ హామీ యివ్వాలి.

4. ఇంతవరకు ఇండియాలో అనుసరించబడిన విధానానికి కారకుడైన అమెరీ (ఇండియా మంత్రి)ని వెంటనే తొలగించి, అతని స్థానే మరియొక మంత్రిని నియమించాలి. అతడు బ్రిటన్‌లోను, ప్రజాతంత్రవాదుల విశ్వాసాన్ని చూరగొన్నవాడై యుండాలి. అప్పుడే సంప్రతింపులు జయప్రదంగా కొనసాగడానికి అవకాశం యేర్పడుతుంది.

(4 వ పేజీ తరువాయి) మైన ప్రజలు యూరప్‌లో రెండవరంగం తెరవబడాలనే కోర్కెతోబాటు భారతీయుల జాతీయ వాంఛను బలపర్చుతూ తీర్మానాలుచేశారు. అటు తరువాత ఆగస్టు 9 ని గ్లాస్గోలో సమావేశమైన 25,000 మంది బ్రిటిషు పౌరుల యెదుట రజనీ (ఆర్. పి. దత్తు) ఉపన్యసించారు. భారతీయుల కోర్కెలను, భారత స్వాతంత్ర్యానికి, భారత జాతీయ వాంఛను, బ్రిటన్‌లో ప్రజలసానుభూతి ఎక్కువగా వున్నదనడంలో ఏమాత్రమూ సందేహం లేదు. అయితే భారతజాతీయనాయకులలో కొందరి అహింసావిధానానికీ, సంఘీభావం లక్ష్యానికీ, యీ దేశంలో విరివిగా ప్రాముఖ్యతనిస్తూ పత్రికలలో ప్రచారం సాగించడంవల్ల యీ సహకారం కొద్దిగా సన్నగిలినమాట వాస్తవమే గాని, బ్రిటిషు ప్రజల మనస్సులు వక్రమార్గంలో మాత్రం సంచరించడం లేదు.

మా శపథం

భారతదేశపు మా సోదరపార్టీమీద, పత్రికలమీద, నిషేధం తొలగించబడడం మా కెంతైనా సంతోషాన్ని యిస్తోంది. ఆపార్టీకి భారతదేశ ప్రజలలోగల బలానికీ, పలుకుబడికీ, యిది తార్కాణం. మా సోదరపార్టీ భారత ప్రజల స్వాతంత్ర్యం కొరకు అద్భుతంగా పోరాటం సాగించింది. ఇప్పుడుకూడా ఆపార్టీ ప్రపంచ ప్రజలందరూ కోరే భారత స్వాతంత్ర్యాన్ని, అన్నిదేశాల ఐక్యతను యేర్పరుచుతూ ఫాసిజాన్ని నిర్మూలించడంలో సరియైన నాయకత్వము ఆచరణయోగ్యమైన కార్యక్రమము, యిచ్చి తన కర్తవ్యాన్ని తప్పక నెరవేర్చగలదని మా విశ్వాసం. భారతీయులు కోరే న్యాయమైన జాతీయవాంఛకు బ్రిటిషుప్రజల సహాయాన్ని, బలాన్ని, సంపాదించడంలో మా శక్తినంతటినీ వినియోగించుతామని మేము శపథం చేస్తున్నాము. భారతదేశ ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించుతూ, ఆయుధాలు తీసుకొని ఫాసిస్టు దురాక్రమణదారుల్ని యితర మిత్రరాజ్యాల సహకారంతో ప్రతిఘటించగల జాతీయ ప్రభుత్వస్థాపనకై వేగంగా సంప్రతింపులు సాగించబడేలాగు మేము కృషి చేస్తాం. పై సూత్రాలను ఆధారంగా చేసుకొని మేమీ క్లిష్టసమస్యను పరిష్కరించడానికి పూనుకొంటాం. ఈ విధంగా మన ఉభయ దేశాల ప్రజల ఐక్యతకు, ప్రపంచ ప్రజా స్వాతంత్ర్యానికీ, అవసరమైన అన్యోన్య సహకారాన్ని స్థాపించడంలో మేము శక్తివంచన లేకుండా పాటుపడతాం.

(పై సందేశం "పీపుల్స్‌వార్" పత్రికా సంపాదకునికి యీనెల 15 వ తారీఖున టెలిగ్రాంద్వారా అందజేయబడింది.)

కమ్యూనిస్టుల అరెస్టు

ఈ నెల 27 వ తేదీని విజయ నగరంలో విద్యార్థి నాయకులు, కాంగ్రెసు నాయకులు 13 రు అరెస్టు చేయబడ్డారు. విద్యార్థుల సమ్మెను ప్రోత్సహించెనను నేరాన్ని ఆరోపించి, కామ్రేడ్ గోవింద రావు అనే కమ్యూనిస్టును కూడా పోలీసులు అరెస్టు చేశారు. కామ్రేడ్ గోవిందరావు సమ్మెప్రశాంతంగా జరుగునట్లు, విద్యార్థులలో అల్లరి జరుగకుండా, కాలేజీగేట్ల వద్దర విద్యార్థులు పోలీసుల దౌర్జన్యానికి గురికాకుండా మాత్రమే చూచాడు. కాని, విద్యార్థి సంస్థను బలహీనపరచి విద్యార్థుల నేదోవిధంగా రెచ్చగొట్టడానికి పోలీసులకు యీతడు అడ్డు వచ్చాడు. కాబట్టి పోలీసులు యితనిని అరెస్టు చేశారు. విద్యార్థి ఉద్యమంలో అరాజకం వ్యాపించకుండా చేసే యిట్టి కమ్యూనిస్టులను అరెస్టు చేయడంవల్ల ప్రజలలో ఫాసిస్టు అనుకూల భావాలు వ్యాపించ గలవు. ఇట్టి విధానం ఆపు చేయడానికి తీవ్రమైన ప్రజాందోళన అవసరం.

కృష్ణా జిల్లాలో యీ క్రింది కామ్రేడ్సు అరెస్టు చేయబడ్డారు.

(1) 14-8-42 న బందరు తాలూకా రైతు సంఘాధ్యక్షుడైన పడమటి కోటీశ్వరరావుగారు (పెడన).

(2) 15-8-42 న ఎం. రాధాకృష్ణమూర్తి గారు (కోలవెన్ను).

(3) 17-8-42 న అన్నే సూర్యనారాయణ గారు (ఉప్పులూరు).

(4) 18-8-42 న కొమ్మారెడ్డి గోపాల కృష్ణయ్యగారు (చల్లపల్లి)

ఈనలుగురు కమ్యూనిస్టులును అఖిలభారత కమ్యూనిస్టు పార్టీయొక్క విధానాన్ని అనుసరిస్తూ, దేశంలో జరిగే అరాజక చర్యలను వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇట్టివారిని అరెస్టు చేయడంవల్ల ప్రభుత్వాధికారులు ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో తీరని అడ్డంకులు కల్పించుతూ వున్నారు.

గుంటూరుజిల్లాలో కూడా కమ్యూనిస్టులు పోలీసు దౌర్జన్యాలకు గురి అయ్యారు కామ్రేడ్సుఅరవేటి రాములు, తేలప్రోలుసుబ్బారావుపోలేపెద్దికృష్ణమూర్తి, కె.యస్.ప్రసాద్. గారలు తెనాలిలో అరెస్టు చేయబడ్డారు.

కె.వెంకటరత్నం (పల్లెకోన) ఎం. వెంకటరత్నం (పల్లెకోన) పి. లక్ష్మీనారాయణ(పొన్నపల్లి) రేపల్లెలో మరొకరుఅరెస్టు చేయబడ్డారు.

ఆయా ప్రాంతాలలో యిటీవల జరిగిన అరాజక చర్యలను వీరందరూ వ్యతిరేకిస్తూ దెబ్బలు, గాయాలు తగిలిన వారికి సేవ చేస్తూ వున్నప్పటికీ వీరినిపోలీసులు నిర్బంధించడంవల్ల ఫాసిస్టులకు తోడ్పడటం, పంచమాంగ దళానికి సహాయం చేయడం అవుతుంది. తక్షణమే వైవారి నందరినీ విడుదల చేసేవరకు ఆందోళన చెయ్యాలి.

అమెరికన్ నావికులతో....

కామ్రేడ్
సజ్జాద్ జహీర్

అమెరికన్ నావికులు వాళ్లు. బొంబాయి రేవులో వాళ్ళ ఓడ ఆగింది. కరాచీలో మన కామ్రేడ్ ఒకాయన "పీపుల్స్ వార్" పత్రికను వారిలో ఒకరికి అమ్మాడు, దానితో వాళ్ళ ఓడ బొంబాయి వచ్చినప్పుడు వారిలో 10 మంది నేరుగా మన పార్టీ సెంట్రల్ హెడ్‌క్వార్టర్సు ఆఫీసుకు వచ్చారు. ఈ స్వాతంత్ర్య యుద్ధంలో అమెరికన్ ప్రజలు యెలా కృషి చేస్తున్నదీ వాళ్ళునాకు చెప్పారు, వాళ్ళ యూనియన్ ఐన నేషనల్ మేరిటైమ్ యూనియన్‌లో రీయాక్షనరీలను; నిరాశావాదులను యెదుర్కోడంలోను ఫాసిస్టు అనుకూల ప్రజా శత్రువులను వెళ్ళగొట్టడంలోను వాళ్లె నెదుర్కొంటున్న సమస్యలను, వాటిని యెలా పరిష్కరించు తున్నదీ ఆ అమెరికన్ కామ్రేడ్స్ మాతోచెప్పారు.

అమెరికాలో నీగ్రో సమస్యను గురించి వారు మాట్లాడినప్పుడు జాతి వివక్షత లేని ప్రపంచ మానవ స్వాతంత్ర్య నినాదం నేడు ప్రపంచ మంతటా ఎట్లు ప్రాధాన్యత వహించుతున్నదీ నేను గుర్తించాను. ఆ పదిమందిలోను యిద్దరు నీగ్రో కామ్రేడ్సు కూడ వున్నారు. నీగ్రో సమస్యను గురించి వారు చదువుతున్న గ్రంథాలు కొన్ని నాకు చూపారు.

"అమెరికాలో నూటికి పదిమంది నీగ్రో లున్నప్పుడు, నీగ్రో సమస్య పట్ల మే మెట్లు ఉదాసీనత వహించగలం ?" అని వారిలో ఒక మిత్రుడు అన్నాడు. అతడింకా ఇలా అన్నాడు.

"నీగ్రోల హక్కుల కోసం మేము పోరాడకపోతే, ఈ ప్రజా యుద్ధంలో వారు హృదయ పూర్వకంగా ఎట్లు మనతో కలసి పనిచేయగలుగుతారు ? ఇదివరలో అమెరికన్ ఓడల కంపెనీలో నీ గ్రోలకు ఉద్యోగాలు ఇచ్చేవారు కాదు. ఇప్పుడు మా ఓడమీద ముగ్గురు నీగ్రోలు మాతో పనిచేస్తున్నారు." ఓడమీద నావికులు మీటింగులు పెట్టుకునే హక్కును కూడవారిప్పుడు సంపాదించుకున్నామని సగర్వంగా చెప్పారు. ఇంతలో కామ్రేడ్ అజయ్ అక్కడకు వచ్చాడు. అయనను గురించి చెప్పమని అడిగారు. ఫాసిస్టు శత్రువు మన దేశముపై దూక డానికి సిద్ధపడుతున్న ఈ సమయంలో ఇక్కడ సామ్రాజ్యవాద ప్రభుత్వం అవలంబించు తున్న తెలివి తక్కువ నిర్బంధ విధానాన్ని గురించి, వందల కొలది దేశభక్తులు ఎట్లు జైళ్లలో మ్రగ్గుతున్నదీ నేను చెప్పినప్పుడు వారెంతో ఆదరణతో విచార సూచక వందనాలతో విన్నారు.

మరునాడు మరి 30 మంది నావికులు, సోవియట్ యూనియన్ మిత్రులు ఆఫీసుకు వచ్చారు. ఆ వచ్చిన 30 మందిలో నీగ్రో. నార్‌డిక్, స్లావ్, లాటిన్, జ్యూ జాతులవారున్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటాల్ని గురించీ, కాంగ్రెసు, కార్మిక కర్షకోద్యమాలను గురించీ తెలుసుకోవాలని కుతూహలాన్ని వెలిబుచ్చారు.

మన దేశంలో ఈప్రస్తుత పరిస్థితికి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల తలతిక్క ఎట్లు కారణమో వారికి విశదీకరించాను. నెహ్రూ, అజాద్‌ల కంటె ఎక్కువైన ఫాసిస్టువ్యతిరేకు లుండరు. కాని వీరినే అమెరీ "విధ్వంసకుల"ని పేర్లు పెడుతున్నాడు. భారతీయస్వాతంత్ర్య పోరాటాన్ని గురించి సామ్రాజ్యవాదులు చేసే ప్రచారాన్ని చూచి మోసపోవద్దని వారిని హెచ్చరించాను.

సోదర చైనా, సోవియట్ ప్రజల వలెనే భారత ప్రజలు కూడ ఫాసిజాన్ని నాశనం గావించడానికి పోరాడుతారు. కాని సామ్రాజ్యవాదులు వారికి అడ్డు తగులుతున్నారు. అయినప్పటికి భారత కమ్యూనిస్టులు తమ స్వాతంత్ర్య పోరాటం ఫాసిస్టు వ్యతిరేక పంథానుండి తప్పిపోకుండా కృషి చేస్తారు అని నేను వారికి చెప్పాను.

ఇదంతా విన్న తరువాత అనేక ప్రశ్నలు వేశారు. వాటన్నిటికి సమాధానాలు చెప్పాను. అంతా విని వారిలా అన్నారు, "బ్రిటిషు ప్రభుత్వము మీకు స్వాతంత్ర్యం ఇచ్చి తీరాలి."

వారీ మాటలు అన్నప్పుడు ఆ వారమే అమెరికన్ ట్రేడ్ యూనియన్‌ల ఫెడరేషను, భారతీయుల జాతీయ ప్రభుత్వ కోర్కెను బలపరుస్తూ ఆందోళనచేసిన సంగతి నాకు చప్పున స్ఫురణకువచ్చింది. వెళ్ళిపోయేముందు వారిలో ఒక కామ్రేడ్ నవ్వుతూ నా దగ్గరకు వచ్చి ఒక చిన్న ప్యాకెట్ యిచ్చాడు. అందులో "పీపుల్స్ వార్" పత్రికకు రు 150 లు విరాళం, ఒక చిన్న సందేశం వున్నాయి.

ఆ సందేశం యిది.

"భారత దేశాల కార్మికుల మధ్య వుండే సహజ. పరస్పర సానుభూతి బాంధవ్యాన్ని ఇస్తున్నాము. ఫాసిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా భారత ప్రజా యుద్ధంలో మీరు చేసే నిర్మాణయుక్తమైన కృషిని, మీ ప్రక్కనే నిలబడి చూడగలిగే అవకాశం మా అమెరికన్ నావికులకు లభించినందుకు గర్వపడుతున్నాం.

"భారతప్రజాయుద్ధమే అమెరికన్ ప్రజా యుద్ధం అదే నేడు రష్యా, చైనా రంగాలలో జరుతున్న యుద్ధం. అదే నేడు ఫాసిస్టురాక్షసులచే అణచిపెట్టబడుతున్న ఆసియా, యూరప్ ఖండాలలోని ప్రజలందరు సాగించుతున్న స్వాతంత్ర్య యుద్ధం నేటి భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యానికి దారి తీస్తుంది.

భారత కార్మికులారా ! ప్రపంచ కార్మికుల దృష్టి యావత్తు మీపైననే వుంది. మీరు మీ చారిత్రాత్మక కర్తవ్యాన్ని నెరవేరుస్తారని ఆశిస్తున్నాము.

ఇట్లు, మీ సోదర
అమెరికన్ ట్రాన్స్‌పోర్టుసర్వీస్ నావికులు

గుడివాడ విద్యార్థుల విజయం

గుడివాడలో యీ నెల 11వ తేదీని పట్టాభి రామారావు అనే విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వార్త యితర విద్యార్థులు విని, అందరూ పెద్ద ఊరేగింపుతో పట్టాభి రామారావును విడుదల చేయవలసిందని నినాదాలు యిస్తూ జిల్లాకలెక్టరు దగ్గరకు వెళ్ళారు.

అక్కడ జిల్లా విద్యార్థి సంఘ ఆఫీసు సెక్రటరీ అయిన కామ్రేడ్ బి. వి. రావు కలెక్టరుతో విద్యార్థుల వైఖరిని తెలియజెప్పి, యీవిధంగా పై విద్యార్థిని పోలీసులు అరెస్టు చేయడము అన్యాయమని చెప్పగా, కలెక్టరు పట్టాభి రామారావును విడుదల చేస్తామని వాగ్దానం ఇచ్చాడు. ఈ సంగతి యితర విద్యార్థులకు తెలియచేయబడింది. వెంటనే విద్యార్థు లందరు అల్లరి చేయకుండా స్కూలుకు వెళ్ళారు. కొద్దిసేపట్లో ప్రభుత్వము పట్టాభి రామారావును విడుదల చేసింది.

ఈ విధంగా విద్యార్థులు అల్లరులు జరుగకుండా తమ హక్కులకై పోరాడవలసిందని గుడివాడ పట్టణ విద్యార్థి సంఘ కార్యదర్శి హెచ్చరిస్తున్నాడు.

అరాచకం స్వరాజ్యానికి మార్గంకాదు

:: కామ్రేడ్ ::
మద్దుకూరి చంద్రశేఖరరావు

బొంబాయిలో అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశానికి వెళ్లిన జాతీయ నాయకులను 9 వ తేదీ ఉదయం బ్రిటీషు సామ్రాజ్యవాదులు పొగరుబోతుతనంగా అరెస్టు చేసారు. అవార్త తెలియడం తోనే ఆంధ్రదేశమంతా నివ్వెర పోయింది. కాంగ్రెసు అభిమానం గలిగిన ప్రజా సామాన్యమంతా ప్రభుత్వ చర్యను అసహ్యించు కొంది.

కాంగ్రెసు కమిటీచే ప్యాసుచేయబడిన తీర్మానంలో చైనా, రష్యాల విజయాన్ని, మిత్ర రాజ్యాల విజయాన్ని కోరుతున్నామని స్పష్ట పరుపబడింది. ఫాసిస్టు శతృవును హత మార్చడానికి, మిత్రరాజ్యాలకు తగినంతగా సాయపడగల్గడానికే భారత స్వాతంత్ర్యం గుర్తించ బడాలనీ భారత జాతీయ ప్రభుత్వానికి ప్రభుత్వాధికారం అప్పగించ బడాలనీ కోర బడింది. యుద్ధకృషికి ఎట్టి యిబ్బందీ కలిగించడం తమ ఆశయం కాదని స్పష్టపరచింది. పై భారత జాతీయ వాంఛ నెరవేర్చనిచో సత్యాగ్రహం ప్రారంభించుతామని తీర్మానించబడిన మాట నిజమే కాని ముందుగా మిత్రరాజ్యాలయిన అమెరికా, చైనా, రష్యాలకు భారత జాతీయ వాంఛ తెలుపబడి రాజీకొరకు ప్రయత్నించుతానని కాంగ్రెసు అధ్యక్షుడు అజాద్ నొక్కి చెప్పాడు. గాంధీజీ కూడ వైస్రాయితో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపు తానని, తొందర పడనని స్పష్టం జేశాడు.

అనగా రాజీకి యింకా కాంగ్రెసు నాయకుల ద్వారం తెరచివుంచినా బ్రిటీషు ప్రభుత్వం నిరంకుశంగా ముందు దెబ్బ కొట్టింది. దానితో గత రెండు వందల సంవత్సరాల బ్రిటీషు సామ్రాజ్యవాదుల దోపిడి ఫలితంగా ప్రజలలో అణగారివున్న బ్రిటీషు విద్వేషం ఒక్కసారి భగ్గుమంది. రెచ్చగొట్టబడిన జాతీయోద్రేకం విచక్షణ శక్తిని కుంటు పరచింది. దెబ్బకు దెబ్బతో బదులు చెప్పాలనే తత్త్వం కాంగ్రెసు వాదులలో వ్యాపించింది.

ప్రజల ప్రతీకారం

జాతీయ నాయకులు అరెస్టు అయ్యారనే వార్త రాగానే 10 వ తేదీన కమ్యూనిస్టులు బెజవాడ, రాజమండ్రి, కాకినాడ, గుడివాడ, ఏలూరు, గుంటూరు, తెనాలి, మచిలీపట్నం వగైరా ప్రదేశాలలో వెంటనే అసమ్మతి సభలు జరిపారు. క్రమ పద్ధతిని ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని నిరసించి, జాతీయ నాయకులను విడుదలచేసి రాజీ సంప్రదింపులు సాగించాలనీ, యుద్ధ కృషిని జయప్రదంగా సాగించ డానికి జాతీయ ప్రభుత్వాన్ని వెంటనే స్థాపించాలనీ కోరారు. జపాను శతృవు మన దేశ సరిహద్దులలో వున్న యీ సమయాన జాతీయ ఐక్యత ద్వారా జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించి మాతృ దేశ రక్షణకు పూనుకోవలసిన అవసరాన్ని ప్రజలకు తెలియ జెప్పారు.

ప్రభుత్వ చర్యల వలన రెచ్చగొట్టబడిన బ్రిటిషు వ్యతిరేకత అంతటితో ఆగలేదు. జపాను వలే జాతీయోద్రేకం చెలరేగింది. ఆర్గనైజేషను లేని ప్రజలలో యిది మరీ తీవ్ర రూపం దాల్చింది. విద్యార్థులలో, ముఖ్యంగా ఆదివరకు విద్యార్థి సంఘాలలో యెట్టి ప్రముఖ పాత్ర వహించనివారిలో, "స్కూళ్లను మానివేయాలి" అనే కాంగ్రెసువాదుల ప్రచారం పని చేసింది. ఇందులో కొలేజి విద్యార్థులకంటె హైస్కూలు పిల్లలే ముందు కొచ్చారు. ఉద్రేకంతో కూడిన యిలాంటి సమ్మెలు, హర్తాళ్లు ఆంధ్రదేశ మంతటా జరుపడానికి ప్రయత్నాలు జరిగాయి. ఆర్గనైజ్డు విద్యార్థి వుద్యమమున్న చోట్ల అసమ్మతి సమ్మెలు, సభలు మాత్రం క్రమ పద్ధతిని జరుపబడ్డాయి. తరువాత రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు వగైరా చోట్ల యథాప్రకారం స్కూళ్లు పనిచేస్తున్నాయి. కాని యితర అనేక ప్రదేశాలలో యింకా పికెటింగులు చేయబడుతూ సమ్మెలు కొనసాగుతూనే వున్నాయి.

తెనాలిలో పరిస్థితులు యింకా దూరము పోయాయి. విద్యార్థుల ఊరేగింపు బయలుదేరి తెనాలి పట్టణమంతా హర్తాళ చేయించింది. రైల్వే స్టేషను వద్దకు వెళ్ళింది. ఈలోగా రౌడీలు వగైరా ఊరేగింపుకు నాయకత్వం వహించారు. స్టేషనులోని స్పెన్సరు సారా దుకాణం కొల్లగొట్టి తాగారు. స్టేషనుకు నిప్పంటించబడింది. గూడ్సు షెడ్డుకు నష్టం కలిగినది. పూరీ ప్యాసెంజరు ట్రెయిన్ ఆపబడి, తగులబెట్టబడింది. అంతవరకు పోలీసులు ఈ అరాచకాన్ని ఆపడానికి ప్రయత్నం చేయలేదు. తరువాత రిజర్వు వచ్చి, ప్రజలపై కాల్చింది. 4 గురు అచటనే మరణించారు. తరువాత హాస్పటలులో 5 గురు చనిపోయారు.

అరాచక పరిస్థితులు

పాలకొల్లులో కూడ విద్యార్థులచే ప్రారంభించబడిన వూరేగింపు, రౌడీల నాయకత్వంలోకి పోయి, రైల్వే స్టేషను తగులబెట్టబడింది. కల్లుదుకాణం కొల్ల గొట్టి త్రాగి, దోపిడీకి దారితీశారు.

గుంటూరు పట్టణంలో విద్యార్థుల ప్రదర్శనంలో పోలీసువారు అనవసరంగా జోక్యం కలిగించుకొన్నారు. దానికి తోడు రౌడీలు గెడ్డలు వేశారు. మీటింగు పెట్టు కోడానికి పార్కులోచేరిన ప్రజలపై మిలిటరీ కాల్చింది. మొత్తం 4 గురు చనిపోయారు.

భీమరంలో కాంగ్రెసు ఊరేగింపు బయలుదేరింది. కాని చివరకు ఆఫీసు రికార్డులు, శివరావు పేట స్టేషను తగులపెట్టబడ్డాయి. ఇచట కూడ కాల్పులు జరిగి 4గురు మరణించారు. ఇంకా కోడేరు, రేలంగి, ఆకివీడు, దెందులూరు, ఉప్పలూరు, చిలువూరు, దుగ్గిరాల, బాపట్ల, చీరాల వగైరా స్టేషనులు తగుల బెట్టబడ్డాయి. పొన్నూరు చీరాల, చిలువూరు (గుడ్సు ట్రెయిన్) పెనుగొండ, ఆకివీడు, పెంటపాడు, పాలకొల్లు, దేవ రామేశ్వరం, కొణితవాడ, ముమ్మిడివరం సంత, వగైరా ప్రదేశాలలో దోపిడులు జరిగాయి. కొన్నిచోట్ల రైలు పట్టాలు లాగివేయడం, అనేక చోట్ల టెలిగ్రాఫ్, టెలిఫోన్ తీగలు త్రెంచడం జరిగింది. అచంట, చెరుకు మిల్లి వగైరా రిజిష్టరు ఆఫీసులలోరికార్డులు, ఆకివీడుగ్రామ మున్సిఫ్ కరణాల రికార్డులు, పోష్టురికార్డులు అన్నీ ప్రజలు తగుల బెట్టారు. ప్రజలకు బ్రిటీషు సామ్రాజ్యవాదులపై వున్న విద్వేషంతో శవమెత్తి యీ సంఘటనలు జరిగిపోయాయి. వారికి తామేమి చేస్తున్నామో, అది స్వాతంత్ర్యోద్యమానికి ఎలాతోడ్పడనో తెలిసికొనే శక్తి ఆసమయంలో వారికి లేదు.

చీలికలు

ఈ అరాజకం ప్రబలి దోపిడులు జరిగిన చోట్ల ఆస్తిపాస్తులున్న వర్గాలు పోలీసు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరుగెత్తారు. అనగా యీ అరాచకం ప్రజలలో చీలికలు ఏర్పరచింది. పోలీసుల నిరంకుశాధికారం యింకా బలపడింది. ప్రజలపై తీవ్ర మైన నిర్బంధవిధానం ప్రయోగించబడుతూంది.

ఈ అరాజకం తాత్కాలి కోద్రేకం వల్లనే వచ్చింది. వెనకాల బలమైన ఆర్గనైజేషను లేదు. అందుచే ప్రభుత్వ నిర్బంధ చర్యలను ఎదుర్కొనే శక్తిలేదు. క్రమంగా చప్పబడి పోతూంది.

దేశభక్తుల ద్వేషాగ్ని

కాని యీ విధంగా కాల్పులు జరగడం ఆంధ్రదేశ మంతటా ప్రజల ద్వేషాగ్ని మరీ రెచ్చ గొట్టింది. కాంగ్రెసు వాదులు దేశాన్ని యెదుర్కొంటున్న జపాన్ ప్రమాదాన్ని గుర్తించలేక పోతున్నారు. కక్షతో బ్రిటిషు సామ్రాజ్యవాదులను లొంగదీయాలనే కోపం కొద్దీ మన మాతృదేశ రక్షణకు విఘాతం కలిగించే కార్యక్రమం యివ్వసాగారు. ఆంధ్ర కాంగ్రెసు కమిటీ పేరుతోను, గాంధీజీ పేరుతోనూ అరాజక కార్యాలను ప్రోత్సహించే కరపత్రాలు విరివిగా పంచబడు తున్నాయి. కరపత్రాలలో స్పష్టంగా రైల్వే పట్టాలు లాగివేయాలని, టెలిగ్రాఫ్, ఫోన్ తీగలు తెంచాలనీ, ట్రాన్స్పోర్టును విచ్ఛిన్నంచేయాలని సాధ్యమైనన్ని విధాలయుద్ధకృషికి విఘ్నంకల్గించాలని ప్రోత్సహిస్తూ వ్రాయబడింది.

అరాచకం దేశ హితం కాదు

ఈ కరపత్రాలలో సూచించబడిన కార్యక్రమానికి అఖిల భారత కాంగ్రెసు కమిటీ తీర్మానంతో యెట్టి సంబంధం లేదు. తీర్మానంలోనూ అజాద్, నెహ్రూల ప్రకటనలోనూ, గాంధీజీ ఉపన్యాసంలో నైతం మిత్ర రాజ్యాల యుద్ధ కృషికి తామెట్టి ప్రతిబంధకం కల్గించమని స్పష్టంగా చెప్పబడింది. కాని నేడు కాంగ్రెసు వాదులచేత ప్రకటించబడే కరపత్రాలలో పూర్తిగా తద్వ్యతిరేకంగా ప్రచారం చేయబడుతూంది. ప్రజలలోను, దేశ భక్తులలోనూ వ్యాపించిన బ్రిటిషు విద్వేషం ఫార్వర్డు బ్లాకు వారికి చక్కని అవకాశం కలుగజేస్తూంది, అది వరకే దేశరక్షణ కార్యాలను భగ్నం చేయడానికి జపానుకు ఏజెంట్లుగా ఆర్గనైజు చేయడానికి పూనుకున్న విద్రోహులకు ప్రభుత్వ నిర్బంధ విధానం ప్రజలలో కల్గించిన అసంతృప్తి, జపాన్ అనుకూల ప్రచారానికి విద్రోహ కార్యాలకు దోహద మిచ్చింది.

జపాన్ ఏజెంట్ల ప్రమాదం

ఇండియా మంత్రి అమెరీ గ్రుడ్డిగా "భారత దేశ పరిస్థితులు స్వాధీనంలో వున్నాయని" సంతోషించుతున్నాడు. కాని నేడు ప్రజలలో వ్యాపించిన అసంతృప్తిని గుర్తించడంలేదు. జపాన్ ఫాసిస్టుల ఏజెంట్లకు అనుకూల పరిస్థితులను తాను సాగించిన నిర్బంధ విధానమే సృష్టించిందనీ తన సామ్రాజ్యవాద దురహంకారంలో గ్రహించడంలేదు. విపులలైన కాంగ్రెసువాదులు ఫార్వర్డు బ్లాకు వగైరా జపాన్ యేజెంట్ల చేతుల్లోకి పోతారనే సంగతి దేశ శ్రేయోభిలాషు లందరూ గ్రహించాలి. ప్రతి దేశ భక్తునికి నేడు అరాచక పరిస్థితులు మన దేశాన్ని జపాను బానిసత్వం క్రిందికి యెలా కొనిపోతాయో నచ్చచెప్పడం కమ్యూనిస్టుల కర్తవ్యం. జపాన్ దుండగీడులు చైనా దేశంలో జరుపుతున్న దురంతాలను వివరీకరించాలి మన నెత్తిపై నున్న బ్రిటిషు సామ్రాజ్యవాదం క్రింద బానిసత్వమనే దుంగను దించుకోవా లనుకొంటూనే మరొకవైపున ఫాసిస్టు బానిసత్వమనే రాతిని నెత్తి నెక్కించుకోడం సబబుకాదని తెలియ జెప్పాలి. గత 6 సంవత్సరాలుగా కాంగ్రెసు మహాసభ బలపరుస్తున్న చైనా స్వాతంత్ర్యోద్యమానికి ద్రోహంచేయజాలమనే ఆత్మగౌరవాన్ని పురికొల్పి కాంగ్రెసు వాదులను, దేశ భక్తులను జపాన్ యేజంట్ల వలలో పడకుండా కాపాడాలి. ఫాసిస్టు యేజంట్లను ప్రజలకు దూరం చేయాలి. మనం ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే తమ మాతృ దేశాన్ని, స్వాతంత్ర్యాన్ని ప్రేమించే దేశభక్తు లందరిని, నేటి అరాచక పరిస్థితులు యెచటికి దారి తీస్తాయో తప్పక నచ్చచెప్ప గలుగుతాము. గత 20 యేండ్లుగా దేశ భక్తుల రక్త మాంసాల అర్పణతో నిర్మించబడిన జాతీయ ఉద్యమాన్ని, భారత భూమిని జపాన్ దుండగీడుల నుండి రక్షించుకోవాలనే సత్యాన్ని గ్రహించునట్లు చేయగల్గుతాము. దేశ సరిహద్దులకు శత్రువు వచ్చి వేచివున్న సమయములో ట్రాన్స్పోర్టు సౌకర్యాలు పాడుచేయడం యుద్ధకృషికి నష్టం కలుగజేసి, జపానుకు సాయపడిన ట్లవుతుందని గ్రహించునట్లు చేయగల్గుతాము.

ప్రజలలో సంక్షోభం

అధిక ధరలు దోపిడి వలన, నిరుద్యోగము వలన, బీద ప్రజలలో అసంతృప్తి హెచ్చుపెరిగివుంది. కమ్యూనిస్టులు వగైరా ప్రజాసేవకులు చౌకధరల డిపోలను ప్రభుత్వం తెరవాలనీ, కరువు పనులు ప్రారంభించాలని ఎంత ఆందోళన చేసినా ప్రభుత్వోద్యోగులు వినిపించు కోవడంలేదు. ఆకలితో మాడుతున్న ప్రజ అరాజకాన్ని ప్రోత్సహించే వారి చేతుల్లో సులభంగా పడుతుంది. ఉద్యోగులు బహిరంగంగా అధిక ధరలద్వారా జరిగే దోపిడిని అరికట్టుటలేదు. ప్రజాసేవకుల సలహాను పెడచెవినిపెడు తున్నారు. దోపిడి జరిగిన పాలకొల్లు వగైరా చోట్లమాత్రం వర్తకులే భయపడి రూ 1కి 8 శేర్లు బియ్యం అమ్ముటచే అల్లరి ఆగిపోయిందనే సంగతి ఉద్యోగులు గ్రహించాలి. వెంటనే చౌకగా జీవితావసరాలగు వస్తువులను అమ్మించియు, కరువు పనులు ప్రారంభించియు, అరాజకం రాకుండా ఆపుచేయాలి. ప్రజల కష్టాలను తీర్చకుండా నిర్బంధాల ద్వారా అరాజకాన్ని తొలగించ గల్గుదు మనుకోడం కంటె మూర్ఖత్వం వుండబోదు.

సామ్రాజ్యవాదులకు హెచ్చరిక

సామ్రాజ్య వాదులు దురహంకారముతో జాతీయనాయకులను అరెస్టు చేసి, ప్రజలను రెచ్చగొట్టడం వలన తాము మిత్ర రాజ్యాలకు, ప్రజా పక్షానికి తీరని అపకారం చేశారు. ప్రజలలో సహకారం లేకుండా ప్రజాయుద్ధాన్ని జయించలేమనే సత్యాన్ని బ్రిటీషు పాలకులు యెంత త్వరగా గ్రహించితే అంత మంచిది. సామ్రాజ్యవాద నిరంకుశ పద్ధతితో ప్రజా యుద్ధాన్ని జయించడం అసంభవమని హెచ్చరించు తున్నాము.

(మిగతా 9 వ పేజీలో)

ప్రజా విజయానికి ★ ★ ★ ఇదిమార్గం

ఆంధ్ర దేశంలో "శ" అను విమానాశ్రయము దగ్గర నిత్యం 2000 మంది కూలీలు, 500 మొదలు 1000 వరకు రైతుల బండ్లు లారీలు పని చేస్తున్నాయి. ఇంతేగాక, సమీపములో నున్న క్వారీలలో సుమారు 6000 మంది కూలీలు పని చేస్తున్నారు. విమానాశ్రయమును నిర్మించడానికి నియోగించబడిన రెండు కంపెనీలవారికిక్కావలసిన బండ్లు వగైరా ప్రజలదగ్గర నుండి ఉత్తరువుల ద్వారా అందజేయడానికి ఒక ప్రభుత్వ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టరు వున్నారు. రైతులు, కూలీలు, డ్రైవర్లు, ప్రభుత్వాధికారులతోను, కంట్రాక్టరులతోను, తమ హక్కులకొరకు పోరాడి యెలా జయించుతూ తమ కర్తవ్యాన్ని నెరవేర్చుతున్నారో, యీ వ్యాసంలో ఉదహరించబడింది.

రైతులపై కేసులు

జూలై 20 వ తేదీనుండి వర్షాలవల్ల ఉత్తరాది రైతులకు వ్యవసాయ తరుణము వల్ల, బాడుగ రేట్లు తగ్గించ బడుట వల్ల, చాలామంది రైతులుబండ్లు కట్టడం మానివేశారు. డిప్యూటీ కలెక్టరు స్పెషల్ ఆఫీసరుకో, బండ్లు కట్టని రైతులపై ఇండియా రక్షణ చట్టంక్రింద కేసులు పెట్టమని ఉత్తరువు చేశాడు. 10 గ్రామాలలో 15 గురు రైతుల మీద కేసులు పెట్టబడ్డాయి. ఒక్కరోజు కూడా బండ్లు కట్టని వారి మీదనే యీ కేసులు పెట్టబడ్డాయి. ఇందులో బండ్లు లేని వారు కూడా ఉన్నారు. మొట్ట మొదట 5 కేసులలో ఒక్కొక్కరికి రు 5 నుండి రు. 25 ల వరకు జరిమానాలు వేశారు. మిగిలిన కేసులకు డిఫెన్సు పెట్టుకున్నారు. ప్రక్కనున్న రెండు గ్రామాలలో 50 కేసులు పెట్టాలని ప్రయత్నంలో వున్నారు. జూలై 27 వ తారీఖున జిల్లా రైతు సంఘాధ్యక్షుడు రైతులతో వెంటనే బండ్లు కట్ట వలసిందనియూ, వారి కోర్కెలు నెరవేర నునియూ, కేసులు ఉపసంహరించు కొనబడునియూ, చెప్పి బండ్లు కట్టించారు. తత్ఫలితంగా జూలై 28 న 170 బండ్లు పనిచేస్తే ఆగష్టు 2 నాటికి 1400 బండ్లు ఆగష్టు 11 నాటికి 1930 బండ్లు పని చేయసాగాయి.

జిల్లా రైతు సంఘాధ్యక్షుడు స్పెషల్ ఆఫీసరును కలుసుకొని రైతుల యిబ్బందులను గురించి, వారి కోర్కెలను గురించి చెప్పుచూ, రైతులను రెచ్చగొట్టడంవల్ల లాభం ఉండకపోగా నష్టం వాటిల్లుతుందని తెలియ జేశారు. స్పెషల్ఆఫీసరు కేసులు పెట్టడం మానివేశాడు. కేసులు ఉపసంహరించుకోవలసిందని 28-7-42 నుండి చుట్టుపట్ల గ్రామా లన్నింటిలోను తీవ్రమైన ఆందోళన జరిగింది. జిల్లా కలెక్టరు వద్దకు ప్రజలు పిటీషనులు, డెప్యుటేషన్లు తీసుకు వెళ్లారు. ఫలితం, యిక కేసులు పెట్టవద్దనీ, ఉన్న కేసులు ఉపసంహరించ వలసిందనీ, జిల్లాకలెక్టరు ఉత్తరువు జారీ చేశాడు. ఇది రైతులకు గొప్ప విజయం. శిక్షల వద్ద 5 గురు రైతుల తరపున అప్పీలు చేయబడింది.

రేట్లు

ఎవరో కొందరు రైతులు తప్పుడు చీట్లు తెచ్చారనే కారణంతో కంట్రాక్టర్లు రేట్లు విపరీతంగా తగ్గించారు. వెంటనే జిల్లా రైతుసంఘం పూనుకొని స్పెషల్ ఆఫీసరుకు కలెక్టరుకు రైతులచే పిటీషన్లు పెట్టించింది. జిల్లా రైతు సంఘాధ్యక్షుడు స్పెషల్ ఆఫీసరును కలుసుకొని రైతులకు న్యాయమైన రేట్లు యివ్వనిచే వారు బండ్లు కట్టరనీ, కేసులు పెట్టినా లాభం ఉండదనీ తెలియ జేశారు.

రైతుల కోర్కెలు :-(1) రేట్లు యధాప్రకారముగా యివ్వాలి. (2) రేట్లు తగ్గించిన చీటీలకు కూడా మొదటి రేట్లు యివ్వాలి. (3) 200 జతల యెడ్లకు పాకలు వేయించాలి. (4) కేసులు పెట్టగూడదు. రెండు కంపెనీలలో ఒక కంపెనీ యధా ప్రకారపు రేట్లు యిచ్చింది. తగ్గించిన కాలానికి కూడా పూర్తి రేట్లు యిచ్చింది. కాని రెండవ కంపెనీ రైతులు కోరినరేట్లు ఇవ్వలేదు. స్పెషల్ ఆఫీసరుమాత్రం ఆ రేట్లను సపోర్టు చేశాడు రైతులు సమావేశమై పిటీషను వ్రాసి, సంతకాలతో పి. డబ్ల్యు. డి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు ఇచ్చారు. ఆయన కంపెనీ ఇంజనీరును పిలిపించి, సాయంకాలం లోగా రైతులకు యధా ప్రకారపు రేట్లు యివ్వకపోతే కంట్రాక్టు రద్దు చేస్తామని బెదరించాడు. సాయంకాలానికి రైతు లందరికీ డబ్బు యిచ్చివేశారు.

దూర గ్రామాలనుండి వచ్చే యెడ్లకు పాకలు వేయించాలని రైతులు కోరారు. ఒక కంపెనీ మాత్రం 25 జతలకు పాకలు వేయించారు. రైతుసంఘము తరపున జిల్లాకలెక్టరుకు స్పెషల్ ఆఫీసరుకు పిటిషన్లు పెట్టి పి. డబ్ల్యు. డి. ఎక్జిక్యూటివ్ ఇంజనీరు వద్దకు రాయబారాలు తీసుకు వెళ్లారు. అన్ని యెడ్లకు సరి పోవు పాకలు వేయించుటకు సబ్ కంట్రాక్టర్లుకు ఆర్డర్లు యివ్వబడ్డాయి. పాకలు వేయించారు.

కొత్తవర్కుకు రేట్లు

కొత్తగా రోడ్డు వర్కుకు స్థలాలకొలతలు తీసుకొని, రైతు ప్రతినిధి, ప్రభుత్వ ప్రతినిధి, కంపెనీ ప్రతినిధి, కలిసి రేట్లను నిర్ణయించారు. దీనిప్రకారం ఒక్కొక్క బండికి రోజు 1 కి 4 లేక 5 రూపాయలు గిట్టుతోంది ఒక రోజున 'త' అను గ్రామం నుండి 41 బండ్లువచ్చిన తరువాత పనిలేదన్నారు. బండ్లు వచ్చిన త్రర్వాత బాడుగ యివ్వవలసిందే నని రైతులు కోరారు. స్పెషల్ ఆఫీసరు, కంపెనీ కూడా యిందు కంగీకరించారు.

కూలీలు

సుమారు 2000 మంది కూలీలు పని సరిగా చేయడం లేదనే నెపంతో, వారికి మనగజం 1కి 0-4-0 చొప్పున యిచ్చేరేటును 0-2-0 కు తగ్గించారు. అనప్పటికీ కూలీలు పనిమానలేదు. అన్ లోడింగు దగ్గర కొలతల ప్రకారం డబ్బు యిస్తామని మరి యొక షరతు పెట్టారు. దీనితో కూలీలు పనిమానవలసి వచ్చింది. తాలూకా వ్యవసాయ కూలీసంఘ ఆర్గనైజరు కూలీల కోర్కెను స్పెషల్ ఆఫీసరుకు, కంపెనీకి తెలియ పరచి, రైతుసంఘపు తోడ్పాటుతో తిరిగి మన గజం 1కి 0-4-0 రేటును సంపాదించు కున్నారు. పని మానిన సమయంలో తోలుకువెళ్లిన బ్లాట్లకు కూడా కూలి యివ్వబడింది. కూలీ సంఘమును గుర్తించ నిరాకరించిన కంపెనీ, చివరకు గత్యంతరం లేక గుర్తించింది.

లారీ డ్రైవర్లు క్లీనర్లు

వీరికి జూలై జీతాలు, ఆగష్టు 7 వ తారీకు వరకు యివ్వలేదు. 80 మంది డ్రైవర్లు, 90 మంది క్లీనర్లు విమానాశ్రయంలో పని చేస్తున్నారు. డ్రైవర్లకు ఒక్కొక్కనికి రు 75, క్లీనర్లకు ఒక్కొక్కనికి రు 35 యిప్పించవలసిందనీ, జీతాలు సకాలంలో వచ్చేలాగు చూడవలసిందనీ, వీరు రైతు సంఘ సహాయాన్ని కోరారు. వారి కోరికలను ఒక పిటీషనులో ఉదాహరించి సెంట్రలు పి. డబ్ల్యు. డి. సూపరింటెండింగు యింజనీరుకున్నూ, చీఫ్ యింజనీరుకున్నూ పంపించారు. జీతాలు వెంటనే హెచ్చింపవలసినదని సూపరింటెండింగు ఇంజనీరుకు టెలిగ్రాం యిచ్చారు. దానితో మరునాడు రావలసిన జీతాలు వచ్చాయి. జీతాల హెచ్చింపు విషయం కేంద్రప్రభుత్వము ఆలోచిస్తున్నదని తెలుస్తోంది.

పరిహారం

ఆర్. ఏ. ఎఫ్. బిల్డింగులకు ఇంకా కొన్ని భూములు తీసుకున్నారు. రహదార్లవల్ల కొన్ని భూములలో పైర్లు చెడిపోయాయి. ఈ రెండింటికి పరిహారం యివ్వవలసిందిగా పిటీషనులు పెట్టుకున్నారు. జిల్లా కలెక్టరు యిందుకు సమ్మతించాడు. తహసిల్దారు లెక్కలు వేస్తున్నారు.

గుణపాఠం

కొద్దిమంది రైతులు గుమాస్తాలయొక్క, స్థానిక రైతుల యొక్క సహాయంతో దొంగ చీటీలు తీసుకురావడం మొదలుపెట్టారు. దీని వల్ల లాభపడేది 100 కి 4 గురు; నష్టపడేది 100 కి 90 మంది. రైతు సంఘ ఆదర్శానికి యిది వ్యతిరేకమని యెంచి, ఆ కొద్దిమంది రైతులకు రైతు సంఘాల ద్వారా జుల్మానాలు విధించి గుణపాఠం నేర్పారు.

కొంత మంది స్థానిక రౌడీలు దొంగ చీటీలు తీసుకొచ్చి మార్చు కొనుటకు ప్రయత్నించిరి. వారిని పోలీసులకు వప్పగింపగా పోలీసులు లంచము తీసుకొని, వారిని విడిచి పెట్టారు. ఈ విషయాన్ని రైతుసంఘం తీవ్రంగా ఖండించింది.

స్థానిక రైతు సేవకులు, కూలీ సేవకులు, నిరంతరము అక్కడే పనివారలకు సలహా చెబుతూ బహిరంగ సభలద్వారా వారి రాజకీయ చైతన్యాన్ని వృద్ధిచేస్తున్నారు.

పోలీసుల దౌర్జన్యాలు

ఈ నెల 17 వ తేదీ ఉదయం చల్లపల్లిలో కొమ్మారెడ్డి గోపాల కృష్ణయ్యగారిని అరెస్టు చేశారు. ఈయన ఆ గ్రామాలలో అరాచక కార్యాలు జరుగకుండా చేయాలని కృషి చేస్తూ తిరుగుతూ వుండగా ఒక బస్సులో 25 మంది రిజర్వు పోలీసులు, బందరు సర్కిలు యిన స్పెక్టరుగారు వచ్చారు. సబు రిజిష్ట్రారు యింటి ముందు కామ్రేడ్ కె. గోపాల కృష్ణయ్యగారు నిలబడి వున్నారు. పోలీసులు బస్సుదిగి వారిని బాగా కొట్టారు. కర్రలతో పొడిచారు. దగ్గర వున్న సైకిలు లాగుకున్నారు. తర్వాత వారిని అరెస్టు చేశారు. తదుపరి రైతు సంఘ ఆఫీసుకు వెళ్ళారు. సర్కిలు యిన స్పెక్టరుగారు ఆఫీసుబీరువా తాళము బ్రద్దలుకొట్టి రికార్డులు చెల్లాచెదరు చేసి పాత మినిట్సు పుస్తకము. కాపీయింగు పెనసళ్లు, తీసుకు వెళ్ళారు. ఆఫీసు వద్దనున్న 3 సైకిళ్లు కూడా తీసుకు పోయారు. ఆఫీసువా రెచ్చటికి వెళ్ళారో చెప్పమని ప్రక్కయింటివారిని ఒకరిని కొట్టారు. బండ బూతులు తిట్టారు.

ప్రక్కనున్న గోపాల కృష్ణయ్యగా రింటికి సోదాకు వెళ్ళారు. ఆయన భార్య కె. సత్యవతి వారింటో లేనిదే సోదా యెలాచేస్తారు ? అని అడిగినా, తోసుకుని లోపలికి వెళ్ళారు. అక్కడ సర్క్యులర్లు కొన్ని తీసుకుని వెళ్లారు.

ఇలాంటి దౌర్జన్యాలు ఫాసిస్టు ప్రతిఘటనకు తోడ్పడవు. అరాచకానికీ కమ్యూనిస్టులకూ ఎలాంటి సంబంధమూ లేదు. కమ్యూనిస్టులు తప్పకుండా ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండించి తీరుతారు. ఈవిధంగా స్థానిక పోలీసులు కమ్యూనిస్టులపై దౌర్జన్యంగావించి, అరాచక కార్యాలలోకి వారిని ఈడ్వాలని, తదుపరి అణచాలన్న ప్రయత్నాలను కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రతిఘటిస్తారు.

పిడుగురాళ్ల సబ్ యిన్స్పెక్టరు దౌర్జన్యం

శ్రీ గిరిరాజు సత్యనారాయణగారు పిడుగురాళ్లనుండి ఇలా వ్రాస్తున్నారు.

14 వ తేది రాత్రి 8-30 గంటలకు పిడుగురాళ్ల సబ్ యిన్స్పెక్టరు యువజనసంఘ లైబ్రరీ వద్దకు వచ్చి తాళంచెవికావాలని అడిగారు. లైబ్రరీ కార్యదర్శి కామ్రేడ్ పఠాన్ అజద్ ఖాన్ గారు తాళంచెవి పోయినదని, కావలసివుంటే తాళం పగుల కొట్టవచ్చునని చెప్పారు. అంతట సబ్ యిన్స్పెక్టరు కార్యదర్శిని కొట్టారు. కార్యదర్శిని యితర యువజన సంఘ సభ్యులను రాత్రికి పోలీసుస్టేషనుకు తీసుకు పోయి అక్కడే పడుకోమన్నారు. లైబ్రరీడబ్బు 8 రూ తీసుకొని హరిజనహాస్టలుకు యిచ్చారు. నవలలు స్వాధీన పర్చుకొన్నారు. వాటిలో రాజకీయ పుస్తకాలు ఏమీలేవు. స్వాధీనపర్చుకున్నపుస్తకాల రసీదు యివ్వ నిరాకరించారు. యువజనసంఘమునకు ప్రస్తుతంజరుగుతున్న కాంగ్రెసు వుద్యమానికి ఎల్లాంటి సంబంధం లేదని చెప్పినప్పటికి యిల్లా చేశారు.

కార్మికుల అసమ్మతి

ఈ నెల 22 వ తేదీని ఏలూరు మునిసిపల్ వర్కర్సు అండ్ ఎంప్లాయీస్ యూనియన్ యొక్క కార్యనిర్వాహక వర్గం అర్జి నశ్రయ్య గారి అధ్యక్షతను సమావేశమై, యీ క్రింది తీర్మానమును గావించెను:—

"ఆంధ్రరాష్ట్ర మునిసిపల్ అండ్ లోకల్ బోర్డ్సు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులును, తెనాలి మ్యునిసిపల్ వర్కర్సు యూనియన్ అధ్యక్షులును, కాంగ్రెసు సేవకుడును, ఫాసిస్టు వ్యతిరేకియు, అయిన కామ్రేడ్ తేలప్రోలు సుబ్బారావు గారిని అన్యాయంగా గవర్నమెంటు అరెస్టు చేసి నందుకు యీకమిటీ వారు తీవ్రంగా ఖండిస్తూ, జపాను ఫాసిస్టులను యెదుర్కొనుటకు ముందంజవేయు వీరిలాంటి కమ్యూనిస్టులను అరెస్టుచేయడంవల్ల జపాను ఫాసిస్టులకు మార్గం సరిచేయుచు అనియు, గవర్నమెంటు యిట్టి స్వవినాశకర పద్ధతిని వదలి, వెంటనే సుబ్బారావు గారిని, వారితో అరెస్టు చేయబడ్డ కామ్రేడ్ ఎ. రాముడు మొదలైనవారిని కృష్ణాజిల్లాలో అరెస్టు చేయబడిన 4 గురిని (కమ్యూనిస్టులు) విడుదల చేయవలసిందని యీ కమిటీ వారు హెచ్చరించు చున్నారు."

భీమవరంలో కమ్యూనిస్టులఅరెస్టు

ఇటీవలనే కొద్ది రోజుల క్రితం వెల్లూరు జైలు నుంచి విడుదల చేయబడ్డ కామ్రేడ్ తనికెళ్ళ చలపతిని, లాజరస్ను, భీమవరంతాలూకా వేంద్రలోను, ఆకివీడులోను, పోలీసువారు డిఫెన్సు అఫ్ యిండియాచట్టం 129 వ రూలు క్రింద అరెస్టు చేశారు.

భారతీయులు ఐక్యం కాగలరు

(3వ పేజీ తరువాయి)ట్లకు మిగిలిన (Residuary) అధికారాలను యివ్వాలనడం కూడ దీనికి తోడ్పడుతుందని చెప్పవచ్చు. కాని యిప్పుడు కావలసినది యేమంటే, జాతుల స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించడమే. దానివల్ల జాతీయ ఐక్యతా సమస్య పరిష్కరింప బడుతుంది.

సారాంశం

అందుచే అంతా అనుకుంటునట్లుగా ముస్లింలీగు, తలుపులు బిడాయించకుండా రాజీకి తెరిచే వుంచింది. సంప్రదింపులకు తన సంసిద్ధతను ప్రకటించడం ద్వారా, ఈ క్లిష్టసమయంలో కావలసిన జాతీయైక్యతను నెలకొల్పడానికి సిద్ధముగా నున్నానని చూపింది. కాంగ్రెసు - లీగు ఏకీభావం ద్వారా జాతీయ ప్రభుత్వానికి పూర్తి అధికారాలను కోరడానికి అంగీకరించింది. దీనివల్ల దేశములోని ఇతర జాతీయ వాదులతో పాటుగా తానుకూడ తన సర్వస్వాన్ని వినియోగించి, ఈ నిరంకుశ సామ్రాజ్యవాదులనుండి, అధికారాన్ని గుంజుకొని విజయ వంతమైన దేశరక్షణకు పూనుకొనుటకు సిద్ధంగావుంది. భారత దేశ సంపూర్ణ స్వాతంత్ర్యమే లీగు యొక్క ఆశయమని పునరుద్ఘాటించడం వలన, దేశస్వాతంత్ర్యం విషయమై భారత ప్రజలలో ఎట్టిచీలికలు లేవని ప్రపంచానికి చాటింది. అదికోరేదంతా న్యాయమైన స్వయంనిర్ణయ హక్కుమాత్రమే.

ఈ హక్కును నిరాకరించడ మంటే, అంతా సామ్రాజ్య వాదులకు వదలి పెట్టడమే అవుతుంది. స్వయ నిర్ణయాధికారమా సర్వనాశనమా? భారత దేశం ఐక్యతతో, ఈనిరంకుశ విధానాన్ని, జపాను దాడిని ఎదుర్కొడమా లేక పాలస్టయిన్‌వలె పడివుండడమా? ఇవేనేడు మనల నెదుర్కొంటున్న ప్రశ్నలు.

కర్తవ్యం

ఈ అవకాశాన్ని తీసికొని ప్రతిదేశభక్తుడు మన జాతీయైక్యతను సాధించ గలమనీ, సాధించి తీరాలని ప్రజలలో ప్రచారం చేయాలి. కాంగ్రెసుకు - లీగుకు మధ్యగల అభిప్రాయ భేదాలు సన్నగిల్లుతున్నాయి. ఆరెండుసంస్థలు, రోజురోజుకు ఒకదానికొకటి దగ్గరకు వస్తున్నాయి.

జాతీయైక్యత ఎంతో దూరంలో లేదు. స్వయం నిర్ణయసూత్రం అంగీకరించడంద్వారా అది సాధించబడగలదు. మన భారత దేశాన్ని రక్షించుకోడానికి ఐక్యత కావాలి. ఇదే ప్రజలలో మన నినాదం. ఐక్యత కుదురుతుందనే విశ్వాసం వారికి కలిగించడం, అందుకు ప్రజలు చురుకుగా పూనుకునేటట్లు చేయడం, ఇదేమన కర్తవ్యం. ఇంతకంటె ప్రాముఖ్యమైనదీ, ఎక్కువైనదీ అయిన మరొకపని నేడు మనకు లేదు.

రాజాజీవంటి నాయకులపై యీ భారం మరింత యెక్కువగా వుంటుంది. లీగు రాజీకి తలుపులు తెరిచే వుంచింది. కాని దాని నాయకులు తమంతట తాము చొరవతీసుకొని ఆ కృషి ప్రారంభించరు. అలా అని మనం కూడా కాలయాపనం చేయడ మంతటి ఘోర పాతకం మరొకటివుండదు. రాజాజీవంటివారు ఈరెండు సంస్థలకు ఐక్యత కుదర్చడానికి రాయబారులుగా ముందుకు రావాలి. వారి కృషి ఎన్నటికి వృధా కాదు.

అన్నిటికంటె ముఖ్యమైనది యీ ఐక్యతా నినాదం ముస్లిం ప్రజలలో బాగా ప్రచారం కావాలి. మైనారిటీలయొక్క అణచిపెట్టబడే ప్రజలందరియొక్క హక్కులకు పోరాడే సంస్థగా కమ్యూనిస్టు పార్టీ కీర్తి గడించుకుంది. తూర్పు బెంగాలులోను, మలబారు, ఆంధ్రరాష్ట్రాలలో కొన్ని జిల్లాలలోను, ప్రజల హక్కులకై జరిపే స్థానిక పోరాటాలలో కమ్యూనిస్టు పార్టీ ముస్లిం ప్రజల సహకారం కొంత సంపాదించింది. ఈనాడు మన పార్టీ తన పలుకుబడి నంతను వినియోగించి జాతీయైక్యతను సాధించడానికి స్థానికలీగులద్వారా ఆలిండియా ముస్లింలీగుపై ఒత్తిడి తేవాలి.

జాతీయైక్యతకు కావలసిన పరిస్థితులన్నీ యిప్పుడున్నాయి. ఐక్యతను సాధించాలనే దృఢనిశ్చయంతో ప్రతి స్థానిక ముస్లింలీగు, ఒత్తిడిచేస్తే అత్యల్పకాలంలోనే అది సిద్ధించుతుంది. మన మాతృదేశాన్ని రక్షించుకోడానికి, సంపూర్ణస్వాతంత్ర్యాన్ని సాధించడానికి కావలసిన ఐక్యత మనకు సిద్ధించుతుంది.

రైల్వేకార్మికులకు యుద్ధ అలవెన్సు

గతనెల 8వ తేదీని ఇండియాప్రభుత్వం రైల్వేకార్మికులకు యీక్రిందిస్కేలు ప్రకారం, యుద్ధ ఎలవెన్సులను ప్రకటించింది.

2 1/2 లక్షలకంటెయెక్కువ జనసంఖ్యగల పట్టణాలలో నెలకు రు 120 గాని, అంతకు తక్కువగాని, సంపాదించేవారికి రు 10-8-0 చొ॥న. 50,000కంటె హెచ్చు జనసంఖ్యగల పట్టణాలలో నెలకు రు 90 గాని, అంతకు తక్కువగాని, సంపాదించేవారికి రు 8-12-0 చొ॥న

ఇతర ఏరియాలలో నెలకు రు 60 గాని, అంతకు తక్కువగాని, సంపాదించేవారికి రు 7 ల చొ॥న ఎలవెన్సు యివ్వబడుతుంది. అయితే దేశంలో ప్రతిచోట జీవితావసరాల ధరలు 100కి 50 చొ॥న అంతకంటె. ఎక్కువగాను, హెచ్చిపోయాయి. బొంబాయిలో 100కి 68 చొప్పున ధరలు హెచ్చాయి. ఇట్టి పరిస్థితులలో 100కి 30 చొప్పున ఎలవెన్సు యివ్వడం జీతాలలో కోతకోయడమేగాని, ఎలవెన్సు యివ్వడంకాదు. ఢిల్లీలో సమావేశమైన అఖిల భారత రైల్వే కార్మికుల సమ్మేళనం యీస్కేలు చాలదనీ, ప్రభుత్వం యీ సమస్యను పునరాలోచించవలసిందనీ, తీర్మానించింది. దానిప్రకారం రైల్వే కార్మికులు తీవ్రమైన ఆందోళనచేసి, ఎలవెన్సు ఎక్కువ చేయించుకోవలసియుంది.

ప్రభుత్వోద్యోగులకు యుద్ధ అలవెన్సులు

మదరాసు, ఆగస్టు 28:—

మదరాసు ప్రభుత్వంవారు యిట్లు ప్రకటించుచున్నారు:—

జీవితవ్యయం పెరిగిపోయినందున మదరాసు ప్రభుత్వంవారు, యిదివరకు, ఉత్తరువులను మార్చి, ఆగస్టు 1 వ తేదీ నుండి తమ ఉద్యోగులకు కరవు అలవెన్సులు వృద్ధిచేసిరి. ఈ అలవెన్సు చెన్నరాష్ట్రమునకు చేరియున్న దేశీయ సంస్థానములందున్న తమ ఉద్యోగులకుగూడ వర్తింప జేతురు.

ఈ అలవెన్సు నిమిత్తం రాష్ట్రం మూడు భాగములుగ యీ దిగువరీతి విభజింపబడినది:

ఎ.—మదరాసు నగరం మాత్రం.

బి. 50,000 జనసంఖ్యకు మించిన యీ దిగువ నగరములు:— బళ్లారి, బెజవాడ, కాలికటు, కాకినాడ, కోయంబత్తూరు, కంచి, కడలూరు, దిండిగలు, ఏలూరు, గుంటూరు, కుంభకోణం, మధుర, మంగుళూరు, మచిలీపట్నం, నాగపట్నం, నెల్లూరు, పాలఘాటు, రాజమండ్రి, సేలం, తంజావూరు, టిన్నెవెల్లి, తిరుచునాపల్లి, తూతుకుడి, వేలూరు, విశాఖపట్నం విజయనగరం (మొత్తం 26).

సి.—పైన తెలిపిన ఎ, బి లలో చేరని యితర ప్రాంతాలన్ని.

రూ. 39 నెలజీతంకి తక్కువ గలవారికి ఎ-ప్రాంతంలో రూ. 5. బి- ప్రాంతంలో రూ. 4 1/2 సి-ప్రాంతంలో రూ. 4 అలవెన్సు యివ్వబడును. రూ. 30 పైన రూ. 80 లోపు జీతం గలవారికి ఎ, బి- ప్రాంతాలలో రూ. 7 అలవెన్సు, సి- ప్రాంతంలో రూ. 30 పైన రూ 60 లోపు జీతంగల వారికిరూ. 5అలవెన్సు యివ్వబడును.

రూ. 80 లకు మించి రూ. 80 లోపుజీతం పుచ్చుకొనుచు ఎ-బి- ప్రాంతాలలో నున్నవారికిన్నీ, రూ. 60 పైన రూ. 65 లోపున పుచ్చుకొనుచు సి- ప్రాంతంలో నున్నవారికిన్ని, ఎ-బి. లోనున్న 80 జీతాలవారికి సి-లో 60 వారికి సౌకర్యాలతో సరిసమానంగా నుండు నట్లు అలవెన్సు యివ్వబడును.

ఈ స్కేల్సు ప్రకారం యిచ్చేఅలవెన్సులు నేటిపరిస్థితులలో ఏ మాత్రము సరిపోవు. అనేక జీవితావసరమైన సరకుల ధరలు 100కి 50 చొ॥న, 60 చొ॥న హెచ్చియుంటే, మద్రాసు ప్రభుత్వం 100కి 12 1/2 కంటె యెక్కువ స్కేలు యివ్వకపోవడం అన్యాయం 100 కి 50 చొ॥ హెచ్చించవలసియుంది.

అంతేగాక, దేశంలోవున్న వివిధపరిశ్రమలలో పనిచేసే కార్మికులకుకూడా, యుద్ధ అలవెన్సు యిచ్చేటట్లు ప్రభుత్వం శాసనం చేయవలసియుంది.

కృష్ణాజిల్లా రైతుసంఘం

పైసంఘ కార్యనిర్వాహకవర్గం 28-8-42వ తేదీని ముక్కామల నాగభూషణంగారి అధ్యక్షతను సంఘ కార్యాలయములో సమావేశమై యీ క్రింది తీర్మానాలను ఆమోదించింది.

1. బ్రిటిషుప్రభుత్వం నేడు దేశములో అవలంభిస్తూన్న నిర్బంధ విధానం ఫాసిస్టులకు తోడ్పడి, ప్రపంచ ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి భంగంవాటిల్లును. కాబట్టి, యీ నిర్బంధ విధానాన్ని వెంటనే అపుజేసి, కాంగ్రెస్ సంస్థపైగల నిషేధాన్ని తొలగించి, కాంగ్రెసు నాయకులను విడుదలచేసి, వారితో సంప్రతింపులు ప్రారంభించాలి.

2. ప్రజలు ఆవేశ పరవశులై అనేక అరాజకపు చర్యలకు దిగుటవల్ల భారత స్వాతంత్ర్యానికి గాని, జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి గాని, దారితీయకపోగా నిరంకుశాధికారవర్గాన్ని బలపరచి ఫాసిస్టు దురాక్రమణ వారలకు మార్గం యేర్పరచును. కాబట్టి. అట్టి అరాజక చర్యలను మానవలసిందనీ, దేశరక్షణ దళాలతో చేరవలసిందనీ, జాతీయైక్యతకు తీవ్రంగా కృషి జరుప వలసిందనీ, రైతులను హెచ్చరించిరి.

3. రైతుసంఘాలకు, రైతు సేవకులకు, నేడుజరిగే అరాజక చర్యలతో ఎట్టి సంబంధం లేనప్పటికి రైతు సేవకుల అరెస్టు చేయుట, రైతు సంఘ కార్యాలయాలను సోదాచేయుట, మొదలైన నిరంకుశ చర్యలను ఖండించిరి.

4. కయ్యూరు రైతు నాయకుల పైగల ఉరిశిక్షలను రద్దుచేయ వలసిందిగా ప్రభుత్వమును కోరిరి. వారివిడుదలకై రైతు సంఘములు రైతు సేవకులు, తీవ్రమైన ఆందోళన జరుపవలెను.

5. చల్లపల్లి యెస్టేటులో రైతుకూలీలపై మోపబడిన కేసులను డిఫెండు చేయుటకు యీ క్రిందివారితో కూడిన డిఫెన్సు. కమిటీని నియమించడమైనది.

1. ముక్కామల నాగభూషణంగారు (కన్వీనరు)
2. కానూరు బలరామయ్యగారు
3. రామినేని పిచ్చయ్యగారు

మరొకయిద్దరిని కోఆప్టు చేసుకొనవచ్చును.

నాజీ శ్రేణుల వెనుక

ఈగ్రంథమాతృక (ఇంగ్లీషు)ను మాస్కోన్యూస్ జూన్ 9వ తేదీన ఇలా సమీక్ష చేసింది.

ఎ. పొల్యకావ్ వ్రాసిన, "నాజీశ్రేణుల వెనుక" అనే సుప్రసిద్ధ డైరీ, సోవియట్, బ్రిటిషు, అమెరికన్ పత్రికలలో ప్రచురింపబడినది. ఇప్పుడు గ్రంథరూపం దాల్చింది. యుద్ధప్రథమ వారాలను గురించి అది వివరించింది. 1941 జూన్ 22 న-యుద్ధం ప్రారంభమయిన దినాన — పోల్యకావ్ "క్రాస్నాజ్వెజ్‌డా" పత్రిక తరపున ఒక రెడ్‌ఆర్మీ యూనిటును సందర్శించడం తటస్థించింది. అతడు వెంటనే రణరంగానికి పోవలసిందని, ఆ వార్తాపత్రిక ఆజ్ఞాపించింది.

యుద్ధంతోపాటు ఉండడం వలన, పోల్యకావ్‌కు జర్మన్ల ప్రసిద్ధ "పిన్సర్" ఎత్తుగడలను చూడటానికి స్వయంగా అనుభవించడానికి అవకాశం లభించింది. ఆ యూనిట్, చుట్టుముట్టడించ బడింది. రెడ్ఆర్మీ ముఖ్యసైన్యాలతో సంబంధం లేకుండా తెగగొట్టబడ్డారు. శతృవుతో వీరోచితంగా పోరాడుతూ ఆ యూనిట్, చిట్టచివరకు చుట్టుముట్టి దీని బేధించింది, జర్మను టాంకుదళాలను మోసగించి, సోవియటు శ్రేణులకు చేరగల్గింది. పోల్యకావ్ డైరీ.ఈ యూనిట్ దైనందిన జీవితాన్ని వివరంగా ఇచ్చింది. ఆ యూనిట్, కమాండర్ల యొక్క ఆ యూనిట్‌లోని కొందరి మనుష్యుల యొక్క జీవితచరిత్రలను అద్భుతంగా ఈ డైరీలో చిత్రించబడింది."

ఇట్టి అమూల్యగ్రంథం తెలుగులో వెలువడింది.

వెల అర్ధరూపాయి.

ప్రజాశక్తి కార్యాలయం, బెజవాడ.

నిరసన సభలు

దేశంలో దారుణమైన నిర్బంధవిధానాన్ని ప్రవేశపెట్టి, ప్రజలను రెచ్చగొట్టి, ఫాసిస్టు దురాక్రమణకు తోడ్పడే విధానాన్ని అనుసరిస్తూన్న బ్రిటిషు సామ్రాజ్యవాదుల చర్యలను ఖండిస్తూ, కాంగ్రెసు నాయకు లందరినీ విడిచిపెట్టి వెంటనే జాతీయప్రభుత్వాన్ని యేర్పరచవలసిందని అనేకచోట్ల సభలు, సమావేశాలు జరుగుతున్నాయి.

23-8-42 వ తేదీని గన్నవరం తాలూకా రైతు సంఘ సాధారణసభ్యుల సమావేశం శ్రీ రామినేని పిచ్చయ్యగారి అధ్యక్షతను: సత్తెనపల్లి తాలూకాలో కామ్రేడ్స్ పూదోట రాజయ్య, దుర్భా కృష్ణమూర్తి గారలు సంచారం చేస్తూ బయ్యవరం, తురకపాలెం, లగడపాడు, పెదకూరపాడు మొదలైనగ్రామాలలోను, 19-8-42 వ తారీఖున పొగడదొర్వు గ్రామ రైతు సంఘం ఎ.సుందరరాజన్‌గారిఅధ్యక్షతను:ది23-8-42న దివితాలూకా కొక్కిలిగడ్డ శివారు కొత్తపాలెం గ్రామ రైతులు మత్తి వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షతను: కాకినాడ విద్యార్థిసంఘ యాజమాన్యాన 23 వ తేదీన పెద్ద ప్రదర్శనం, బహిరంగసభ జరిగి, వాటిలో ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఖండిస్తూ తీర్మానాలు చేయబడ్డాయి.

గుంటూరు తాల్యూకా మల్లెంపూడి గ్రామంలో స్థానిక కమ్యూనిస్టు యువజన సంఘాల యాజమాన్యాన కూడ 20 వ తారీఖున బహిరంగసభ జరిగింది. సభాధ్యక్షులు ఆరుమళ్ళ పకీరారెడ్డిగారు. సభకు 300 మంది హాజరయ్యారు. ప్రభుత్వచర్యను ఖండిస్తూ జాతీయనాయకుల్ని విడుదల చేయాలని కోరుతూ తీర్మానం చేయబడింది. ఇలాగే, కొత్తపాలెం గ్రామ యువకుల సమావేశం మత్తి నాగభూషణంగారి అధ్యక్షతను 24 వ తేదీని జరిగి పై తీర్మానాలవంటివే ఆమోదించబడ్డాయి. కైకలూరు తాలూకా యువజన సంఘ కార్యనిర్వాహకవర్గం కాకర్ల ప్రసాదరావుగారి అధ్యక్షతను 25 వ తేదీని సమావేశమై నిర్బంధవిధానాన్ని ఖండించారు. ప్రస్తుతం జరిగే అరాజక చర్యలను అరికట్టాలనీ, దేశరక్షణకు రక్షణదళాలు స్థాపించబడాలనీ కూడా తీర్మానించబడింది. బాపట్ల తాలూకా దేవరపల్లి గ్రామ యువజనసంఘం వారు 21 వ తేదీని పెద్ద ఊరేగింపు, బహిరంగసభ జరిపి అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ నాయకులను విడిచిపెట్టవలసిందిగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

• • •

వడ్డమానులో యువజనసంఘ యాజమాన్యాన, జమ్మల వెంకటకృష్ణయ్య చౌదరిగారి అధ్యక్షతక్రింద పెద్ద బహిరంగసభ జరిగి, ప్రభుత్వవిధానం ఖండించబడింది.

22-8-42 వ తారీఖున కస్తాన్‌పాలెంలో కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావుగారి అధ్యక్షతను; 29 వ తారీఖున నెల్లిమర్లలో కామ్రేడ్ కె. వెంకటేశ్వర్లుగారి అధ్యక్షతను; బ్రాహ్మణ కోడూరులో కామ్రేడ్ కె. వెంకటరత్నంగారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలలో ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఖండిస్తూ ఉపన్యాసాలు, తీర్మానాలు చేయబడెను.

• • •

నెల్లూరు మ్యునిసిపల్ కార్మికులు

నెల్లూరు మ్యునిసిపల్ చర్కొద్సుయూనియన్ జనరల్ బాడీ 23-8-42 న కామ్రేడ్ భరద్వాజ్ అధ్యక్షతను సమావేశమై, యీ క్రిందివారిని అధికారవర్గంగా ఎన్నుకొనిరి.

కామ్రేడ్ కె. క్రిష్ణరావు, అధ్యక్షుడు. కామ్రేడ్ కె. కొండయ్య, ఉపాధ్యక్షుడు. కామ్రేడ్ ఎస్. వెంకురెడ్డి, కార్యదర్శి. వీరు గాక, మరొక 7 గురిని కార్యనిర్వాహకవర్గానికి ఎన్నుకొనిరి. ఈ క్రింది తీర్మానాలు సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

1. ప్రస్తుతధరలను బట్టి ఒక్కొక్కనికి రు 15 చొ॥న జీతాలు హెచ్చించాలి.

2. లోగడ యిచ్చే దుస్తులు యిప్పుడుకూడా ఇవ్వాలి.

3. రూల్సుప్రకారం ఒక్కొక్కనికి 40 దొడ్లకంటె ఎక్కువ ఇవ్వకూడదు.

4. చీటికి మాటికి పని వారలపై జుల్మానాలు విధించకూడదు.

5. కాన్పులకు యిచ్చుచున్న జీతంమీద సెలవు నెలరోజులు కాకుండా, 1½ నెలలు యివ్వవలెను.

6. మ్యునిసిపాలిటీవారే బండ్లకు యెద్దులు సప్లయి చేయాలి.

7. సెలవు రోజులలో పనివారిచే పనిచేయించ గూడదు.

8 చౌకధరలకు మ్యునిసిపాలిటి వారే అంగళ్లను తెరవాలి.

• • •

రాజమండ్రి కార్మికుల సమ్మె

సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్లులోని కార్మికులు 25% చొ॥న జీతాలు హెచ్చాలనియు, ధరలు హెచ్చుటచే 3 నెలల కొకసారి వారపు జీతం కరువు భత్యం క్రింద యివ్వాలనియు కోరుచూవచ్చిరి. యజమానులు 3 నెలలనుండి రేపు యిస్తాం, మళ్ళీ వారం యిస్తాం అని కాలయాపన చేయుచుండుటచే కార్మికులు గత్యంతరం లేక 17-8-42 న సమ్మె చేశారు. ఆ రోజునే మిల్లు కార్మికుల సంఘాన్ని స్థాపించుకున్నారు.

మిల్లు యజమానులు కార్మికులను బెదరించుటకై 25 గురు పనివారలను పందలపాక నుండి తీసుకొచ్చారు. వారిని యితర దొంగ కూలీలను, కార్మికులు నచ్చజెప్పి సమ్మెలో పాల్గొనేటట్లు చేస్తున్నారు.

వివిధ వార్తలు

సంఘ కార్యదర్శి సి. ప్రభాకర్‌గారు పట్టణంలో యిండియా రక్షణ చట్టం ప్రకారం మీటింగులపైన, ఊరేగింపులపైన గల నిషేధాన్ని తొలగించవలసిందని జిల్లా కలెక్టరును కోరగా, అందుకు అతడు నిరాకరించాడు. కార్మికుల కోర్కెలు న్యాయమైనవే యని అతడు అంగీకరించి నప్పటికీ, వారి సమావేశ స్వాతంత్ర్యాన్ని అరికట్టడం అన్యాయం.

• • •

నెల్లూరులో చౌక ధరల డిపో

కామ్రేడ్స్. కె. కృష్ణారావు, నరసింహం, ఆదిశేషయ్యగారలతో కూడిన రాయబార వర్గం 17-8-42వ తేదీని నెల్లూరు జిల్లా కలెక్టరువద్దకు చౌక ధరల డిపో యొక్క అవసరాన్ని గురించి మాట్లాడుటకు వెళ్ళారు. చౌక ధరల అంగళ్లు స్థాపించడానికి కలెక్టరు అంగీకరించాడు. 19 వ తేదీని తాలూకా ఆఫీసులో వర్తకులు, బియ్యపు మిల్లువార్లు కలిసి సమావేశమయారు. కామ్రేడ్ కృష్ణారావుగారు, డిప్యూటి కలెక్టరు కూడా అక్కడ హాజరయ్యారు. సభలో వర్తకులు తమలోతాము విరాళాలు కొన్ని వసూలు చేయాలనీ, చౌక ధరలకు అంగడి పెట్టి, ఆ నష్టమును భర్తీచేయుటకు యీ విరాళాలను వినియోగించాలనీ, నిర్ణయించుకొన్నారు. ఈ అంగడి 21-8-42 నుండి ప్రారంభించబడింది.

• • •

గుడివాడ తాలూకా యువజన సంఘం

పై సంఘ కార్యనిర్వాహక వర్గం 15 వ తేదీని పొట్లూరి సుబ్బారావుగారి అధ్యక్షతను గుడివాడలో సమావేశమై; ప్రజా రక్షణ దళాలు స్థాపించుటలో రైతు, కూలి సంఘములతో యువజన సంఘాలు కూడా కృషి సల్పవలెననీ, అందుకు సంబంధించిన పనులు నిర్వహించుటకు పొట్లూరి సుబ్బారావుగారిని, వై. వి. కృష్ణారావుగారిని నియమించుతూ తీర్మానించబడింది.

• • •

పొట్లపూడిలో వ్యవసాల కూలీల సమ్మె

నెల్లూరు తాలూకా పొట్లపూడి గ్రామంలో కూలీలు ఖరా కొలత పాత్రలతో కూలి యివ్వ వలసిందని కోరుతూ సమ్మె చేస్తున్నారు. ఇందుకూరుపేట, కొత్తపాలెంలో కూడ సమ్మె వ్యాపించేటట్లువుంది. రైతులు చుట్టుప్రక్కల గ్రామాలనుండి కూలీలను తీసుకొని రాబోతున్నారు. సానుభూతిపరు లెల్లరు తమ గ్రామాల నుండి సమ్మెను భగ్నం చేయడానికి కూలీలు రాకుండా చూడవలెనని ఆర్గనైజరు కోడూరి బాల కోటారెడ్డిగారు హెచ్చరించుచున్నారు.

• • •

కయ్యూరు ఉరిశిక్షలు రద్దుచేయాలి.

23-8-42 వ తారీఖున దివి తాలూకా కొత్తపాలెం గ్రామ రైతుల సమావేశం మత్తి వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షతను జరిగి కయ్యూరు శిక్షితులపై మరణశిక్షను రద్దు చేయవలెననీ, మంగళాపురం ముత్రాసుల భూమిని తిరిగి యిచ్చివేసి కేసులు ఉపసంహరించుకోవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. కయ్యూరు శిక్షితుల విషయమై 100 మంది సంతకాలతోను, మంగళాపురం రైతుల విషయమై 100 మంది సంతకాలతోను, మహజరు గవర్నరుకు, జిల్లా కలెక్టరుకు పంపబడ్డాయి.

ఇలాగే సత్తెనపల్లి తాలూకాలో లగడపాడు యువజనసంఘం, నెల్లూరు జిల్లాలో వెంకటగిరి యువజన సంఘం కయ్యూరు శిక్షితుల విషయమై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపినారు.

• • •

బహిరంగ సభపై నిషేధం

ఈ నెల 15 వ తేదీన వెంకటగిరిలో టౌన్‌యువజనసంఘ యాజమాన్యాన, కాంగ్రెసు నాయకుల అరెస్టుపట్ల అసమ్మతిని ప్రకటించుటకై బహిరంగసభ ఏర్పాటు గావించబడింది. కాని, సభను నిషేధిస్తూ స్థానికాధికారులు కామ్రేడ్ బి. శంకరయ్యకు తెలియచేశారు. శంకరయ్య యెంత వాదించినప్పటికీ ప్రయోజనము లేకపోయెను. సాయంకాలం బహిరంగసభకు చాలామంది ప్రజలు వచ్చారు. అక్కడికి కూడ స్థానికాధికారులు వచ్చి సభను నిషేధించారు. ఆర్గనైజర్లు సభకువారం రోజులు వాయిదా వేసి ప్రజలను వెళ్ళిపొమ్మని చెప్పవలసి వచ్చింది.

అరాచకం స్వరాజ్యానికి మార్గంకాదు

(6 వ పేజీ తరువాయి) యుద్ధ విజయానికి, భారతప్రజల సహకారం అత్యవసరం. అట్టి సంపూర్ణ సహకారం జాతీయ ప్రభుత్వం క్రిందనే సాధ్యమనే సంగతి బ్రిటిషు పాలకులు గుర్తించాలి. అందుకు వెంటనే కాంగ్రెసు నాయకులను విడుదలచేసి, కాంగ్రెసు - లీగ్‌లతో కలసిన జాతీయ ప్రభుత్వానికి అధికారాన్ని ఒప్పగించాలి. అపుడే ఫాసిస్టు దుండగీడులను జయప్రదంగా త్వరలో నాశనం చేయగల్గుతాము. ఇందుకు బ్రిటిషు ప్రభుత్వం కలిగిరచే ఆటంకాలను మిత్రరాజ్యాల యుద్ధనిర్వహణానికి కల్గించే ఆటంకాలు గానే ప్రపంచ ప్రజలు భావించుతారు. బ్రిటిషు పాలకుల యీ తప్పిదాన్ని మానవకళ్యాణం కోరేవా రెవరూ మన్నించరు. బ్రిటిషు ప్రజలు తమ పాలకుల కండ్లు తెరువగలరని మేము ఆశించుచున్నాము.

కార్యాలయం మార్పు

గుంటూరు జిల్లా యువజన సంఘ కార్యాలయం తెనాలి మారీసుపేటకు మార్చబడింది.

ఇండియాకు ప్రమాదం హెచ్చింది

కామ్రేడ్
తమ్మల వెంకటరామయ్య

స్టాలిన్‌గ్రాడ్‌కోసం యధావిధిగా భీకర యుద్ధం సాగుతూనేవుంది. 10 లక్షల జర్మను సైన్యాలు, ఈ రంగంలో నియమింపబడ్డారు. స్టాలిన్‌గ్రాడ్‌కు మాస్కోవలెనే ముట్టడి (సీజ్)కి తయారయింది. "అందరూ రణగంగా నికి,ఊ నేని"నాదంఈయబడింది. వాల్గానావికులు స్టాలిన్‌గ్రాడ్ కార్మికులు యుద్ధరంగంలో దుముకుతున్నారు. జర్మనీ, పారాచూటిస్టులను నియమించింది. సైన్యాలను విమానాలలో మోసుకవచ్చి పడవేస్తున్నది. స్టాలిన్‌గ్రాడ్‌పై భీకరమైన విమానదాడిని సాగించింది. కాని స్టాలిన్‌గ్రాడ్ చలించలేదు. మిలటరీ ప్రదేశాలకు దెబ్బలు తగలకుండా సోవియటు విమానబలం కాపాడుతోంది. స్టాలిన్‌గ్రాడ్‌కు వాయవ్యంగాను, నైరుతిగాను వచ్చుచున్న జర్మన్‌ధాటిని అతికష్టంమీద ఆపుతోంది. వాయవ్యభాగంనుండి వచ్చిన ధాటిని ఆపడమే గాక రెండు ప్రదేశాలను తిరుగుదాడులవల్ల సోవియటు పట్టుకోగల్గింది. మొన్నటి వార్తల ననుసరించి, ఇచ్చట యుద్ధం రష్యాకు అనుకూలంగా మారుతున్నదని రెడ్‌స్టార్ వ్రాసింది.

క్రాస్నదార్ ప్రాంతంలో సోవియటు సైన్యాలు అతితీవ్రంగా నిరోధించు తున్నాయి. జర్మనీ కూడ ఈ విషయాన్ని అంగీకరించక తప్పిందికాదు. నల్ల సముద్ర తీరమందలి ఒక ప్రదేశంవద్ద దిగాలని జర్మన్లు ప్రయత్నించారు. ఈ ప్రయత్నం కెర్చ్‌వద్దనుండి జరిగింది. కాని రష్యాసముద్రి తీరరక్షణలు పై ప్రయత్నాన్ని విచ్ఛిన్నం మొనర్చాయి. సైనికులతో నిండిన 10 జర్మను నౌకలను ముంచి వేశారు.

గ్రోజ్నీ వైపుకు వెళ్లే మార్గంలో, ప్రొఖ్లాడ్నయా, మోజ్‌దార్, ప్రాంతాలలోగూడ, సోవియటు సైన్యాలు ఎదురు దెబ్బగొట్టి జర్మన్లను ఆపుతున్నాయి.

ఈ విధంగా సోవియటు తన యావచ్ఛక్తినీ వినియోగించి దక్షిణాన జర్మన్ ధాటిని అరికడుతోంది. పరిస్థితుల తీవ్రతగాని, ప్రమాదం గాని, ఏమాత్రమూ తగ్గలేదు. సోవియటుప్రచురణాధికారులలో నొకడగు "యారోస్లావ్‌స్కీ" ఇలా హెచ్చరించాడు.

"కాకాసస్‌ను జయించితే, ఒక రష్యాకే గాక ప్రపంచంలోని స్వాతంత్ర్య వాంఛా దేశాలన్నికి కూడా విషాద పరిస్థితులు సంభవించుతాయి........

హిట్లర్ అను చరులు కాకాసస్ నూనె గనులకు పరుగెత్తుచున్నారు. మన దేశ జీవితానికి ముఖ్యప్రాముఖ్యత గల్గిన అనేకపట్టలను పట్టుకొన్నారు, వాప్న, ప్యాటిగోర్స్కను పట్టుకొన్నారు........ మనం ఇక వెనుదిరగ రాదు. ఎంత నష్ట కష్టాలు గల్గినా శత్రువును వెనక్కి తరమాలి."

ఒక్కగ్రోజ్నీ వైపుకేగాక కొండలగుండా టిప్లిస్‌కువెళ్లే మార్గంకోసంకూడజర్మన్లువెదుకుతున్నట్లు కనపడుతున్నది. కాకాసస్‌లోని ఈ ప్రయత్నాలన్నిటిని నాశంజేయాలని రెడ్‌స్టార్ మొదలగు పత్రికలు ప్రోద్బలించుచున్నాయి. "వరుసగా యుద్ధాలు సాగించుతూ వచ్చిన శత్రువు అలసిపోయి పర్వత ప్రాంతాలకు చేరుకొన్నాడు. శత్రువును ఆపడానికి, ఓడించడానికి మనకు అన్ని అవకాశాలు వున్నాయి." అనిరెడ్‌స్టార్ పత్రిక వ్రాసింది. "ప్రతి పర్వత మార్గాన్ని కొంద చీలికనూ, కొసక్ అశ్విక దళాలతో నింపాలి" అనికూడా రెడ్‌స్టార్ వ్రాసింది. ప్రవదా పత్రిక ఇలా ఉద్బోధించింది.

"శత్రువును దక్షిణాన ఆపడం, నాశనం చేయడం, విజయానికి ప్రాముఖ్యం. వాల్గాపరిసర ప్రాంతాలవద్దనూ, కాకాసస్ పర్వతాల వద్దనూ, జర్మన్లకు మృత్యువు సంభవించాలి."

మధ్యరంగంలో సోవియట్ దాడి

స్టాలిన్‌గ్రాడ్‌లోనూ, దక్షిణరంగంలోను, ఇంత భయానక యుద్ధాలు గావించుతున్నప్పటికీ, మధ్యరంగంలో సోవియటు సైన్యాలు ఎదురుదాడులు సాగించినాయంటే, సోవియటు ప్రతిఘటనాశక్తి తగ్గిపోకపోవడమేగాక, ఎదురు దెబ్బగొట్టేశక్తినికోల్పోలేదని స్పష్టపడుతుంది.

మధ్యరంగంలో కాలినిన్ రంగంలోను, జనరల్ జుకావ్ నాయకత్వాన ఎదురుదాడిసాగింది. జర్మన్‌లను 30మొదలు 50 మైళ్ళదాకా వెనక్కి తరిమివేశారు. 610 గ్రామాలను సోవియటు సైన్యాలు తిరిగి కైవశం చేసుకొన్నాయి. 45 వేలమంది జర్మన్లు చంపబడ్డారు. రెజెవ్. ఘాటిస్క్ వ్యాజ్మాదిశలలో ఈ దాడి సాగింది.

ప్రపంచ యుద్ధ సమీక్ష

రెజెవ్‌ను చుట్టు ముట్టడించారు. కాలినిన్ రంగంలోకూడ సోవియటుసైన్యాలు ముందుకు పోయాయి. కలూగావద్ద, జర్మన్ రక్షణ శ్రేణులను సోవియటుసైన్యాలు బేధించాయి. జర్మన్లు ఈ ప్రాంతలలో తీవ్రమైన ప్రతిఘటన సాగించుతున్నాయి. రెజెవ్‌లో ఈ దాడి ఎందుకు కొనసాగింది? స్టాలిన్‌గ్రాడ్‌పై ఒత్తిడి తగ్గించుకొనుటకు మాత్రమే గాదు. జర్మన్లు కాలినిన్, మాస్కోలపైన, కొత్త దాడులు సాగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, రెడ్‌స్టారు బయటపెట్టింది. అందుకు రెజివ్‌వేదికగా పనికివస్తుంది. ఈ ప్రయత్నాన్ని చెడగొట్టడానికే ఈ దాడిసాగించబడిందనవచ్చు. ఇంతేగాక, ఈ దాడి స్టాలిన్‌గ్రాడు కాకాసస్ రంగాలపై ప్రభావం కల్గించుతుంది, ఇజ్వెస్టియా ఇలావ్రాసింది.

"ఉత్తర రంగంలోను మధ్యరంగంలోను బలహీనమైన ప్రదేశాలున్నట్లు కనుగొన్న చోట్లల్లా, సోవియటు సైన్యాలు దాడిని ప్రారంభించుతాయి." "ఈ దాడి గనుక రష్యన్ల కనుకూలంగా ఇంకా కొనసాగితే, ఒక్క స్టాలిన్‌గ్రాడ్ చుట్టూ పరిస్థితికేగాక, ఈజిప్టులో మన పరిస్థితికి కూడ లాభదాయకంగా వుంటుంది." అని మాంచెస్టరు గార్డియను వ్రాసింది.

ఈ విధంగా సోవియటు తమకోసమేగాక, అటు మధ్యరంగం కోసం, ఇటుఇండియా కోసంకూడ పోరాడుతున్నది. జర్మనుఫేసిస్టుల దురాక్రమణను ఆలస్యంచేస్తోంది. ఇలాప్రపంచ స్వాతంత్ర్యం కోసం సోవియటు యూనియన్ ఒంటరిగా పోరాడు తోంది.

రెండవరంగం

చర్చిల్ - స్టాలిన్ సమావేశం, అనుకొన్నంత ఆశలను కల్పించుట లేదు. రెండవ రంగం వెంటనేకల్పించు సూచనలేదు. టైమ్సు పత్రిక ఇలావ్రాసింది. "వాన్‌బాక్, బాకూను పట్టుకొని ట్రాన్స్ కాకాషియాలోని ఆయిల్ సప్లయిలను రష్యాకు లేకుండా చేసినప్పటికీ రష్యన్ నిలువసంపద చలికాలానికి, వచ్చే సంవత్సర యుద్ధానికి, సరిపోవాలి.

వచ్చేసంవత్సరం, వాన్‌బాక్ ఉధృతాన్ని సడలించడానికి రష్యా జరిపే యుద్ధంలో యునైటెడ్ నేషన్సు పాల్గొంటాయని సహేతుకంగా ఊహించవచ్చు."

ఈ విధంగా రెండవ రంగాన్ని 1943 కి వాయిదా వేయాలని బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రయత్నించుచున్నారు. పార్లమెంటు సభ్యుడు జి. హెచ్. హాల్ కూడ రెండవ రంగాన్నిగురించి మాట్లాడ్డం తమకూ రష్యాకు కూడ అనర్థదాయకమని అంటున్నాడు.

"స్టాలిన్ సంతృప్తి పడితే ఈ దేశం సంతృప్తిపడినట్లేభావిస్తాను. కాని కమ్యూనిష్టులు రెండవరంగం కావాలని కోరే యితరులూ, సంతృప్తిపడటం లేదు. ఎక్కడో ఏదో లోపం వుంది." నిజమే! ఆలోపం "హాల్" వంటి సామ్రాజ్యవాదుల బుర్రల్లో వుంది. జర్మన్లు ఏ మాత్ర మూ కాల విలంబనానికి ఓర్వలేక పోతుంటే, ఇంకా ఏవో కుంటిసమాధానాలు చెబుతూ వుండటం లాభంలేదు. "రెండవరంగం తెరవకుండ వుండటం అక్షరాజ్యాల పరిస్థితిని వృద్ధి చేస్తుంది" అని జర్మను మిలటరీ నాయకులే అంటున్నట్లు టైమ్సు జర్మను సరిహద్దు విలేఖరి వ్రాస్తున్నాడు. రెండవరంగం కోసం అమెరికా కార్మికులలో అపూర్వమైన ఆందోళన ప్రారంభమయింది.

'డీప్పీ' దాడి

"డీప్పీ" దాడికూడ రెండవరంగం వెంటనే ప్రారంభించాలని తెలియజేస్తుంది. పట్టపగలు శత్రువుల దృఢరక్షణ ప్రాంతాలలో, టాంకులను దింపడం 4 వేలమంది జర్మనులను చంపడం, ఖైదీలను పట్టుకోడం జరిగిందంటే, రెండవ రంగం తెరవకపోడానికి మిలటరీ కారణాలు గాక మరేవో కారణాలని అనుకోవాలి. ఈదాడి బ్రిటిషు కార్మికులలోనుంచి ఉత్సాహాన్ని కలిగించిందని, బ్రిటిషు గనిపనివారలు అధికంగా బొగ్గు ఉత్పత్తిచేశారని. పీపుల్సువార్ లండన్ విలేఖరి వ్రాస్తున్నాడు. ఇది రెండవ రంగంకాదు, అప్పుడే తిరుగబడకండి, అని బ్రిటను, ఫ్రెంచి ప్రజలకు విజ్ఞప్తి చేయడమే ఫ్రెంచి ప్రజల తిరుగుబాటు సంసిద్ధతను తెలియజేస్తోంది.

బెర్లిన్‌పై విమానదాడి

రెండవ రంగం ప్రారంభింపక పోయినా బ్రిటిషు విమానాలు జర్మనీపై దాడి సల్పి యుద్ధ పరిశ్రమలకు విపరీత నష్టం కల్గించుతున్నాయి. వీటికితోడు యీవారం సోవియటు విమానాలు బెర్లిన్, కొయినిగ్సుబర్గు, డాన్జిగ్ మొదలగు పట్టణాలపై విమానదాడిని సాగించాయి. ఇది జర్మను ప్రజలలో భీతిని కల్పించుతుందనడంలో సందేహం లేదు. శత్రువుల విమానం ఒక్కటికూడా జర్మనీపై యెగురదనే గోరింగ్ డాబుల కర్థం యిపుడు తెలుస్తుంది.

బ్రెజిల్ యుద్ధ ప్రవేశం

సోవియటు సైన్యాలు మధ్య రంగంలో యెదురు దాడి చేయడం, సోవియటు విమానాలు బెర్లిన్‌పై యెగరడమే గాక, క్రిందటి వారం మరొక మంచి వార్త వచ్చింది. అది బ్రెజిల్ యుద్ధంలో ప్రవేశించడం. బ్రెజిల్ ఖనిజ సంపదలు మిత్రరాజ్యాలకు లాభకరముగా వుండటమేగాక, స్ట్రాటజికల్‌గా కూడ లాభకరమే. ఆఫ్రికా పశ్చిమ తీరాన డాకర్ నుండి వచ్చే ప్రమాదాన్ని బ్రెజిల్ రేవుల నుండి అరికట్టవచ్చు.

ఈజిప్టు రంగం

స్టాలిన్‌లో చర్చిల్ సంప్రదింపులు జరిపిన పిదప, చర్చిల్ ఈజిప్టు వచ్చాడు. ఈజిప్టు మధ్యప్రాచ్య దేశాలను ఒక సేనానిక్రింద, ఇరాక్ ఇరాన్‌లను మరో సేనానిక్రింద, ఇండియా బర్మాలను మరోసేనానిక్రింద వుంచాడు. ఈ విధంగా విభజించడం, కాకాసస్ వైపునుండి, ఈజిప్టునుండి జర్మనుదాడి ప్రమాదం ఉండుటవలననే. ఈజిప్టులో, శత్రువులదాడి నరికట్టడానికి మాశక్తిలో ఉన్నంతవరకు పనిచేస్తామని చర్చిల్ ధైర్యవచనాలు పలికాడు. అయినా ఈజిప్టులో బ్రిటనే ఎదురుదాడి సాగించకపోవచ్చు. జనరల్ స్మట్సు ముందు సంవత్సరం ఇచట ఎదురుదాడులు సాగించుతామని చెప్పాడు. జనరల్ రోమెల్ ఈజిప్టు దండయాత్రకు సిద్ధమవుతున్నట్లు, మాంచెస్టరు గార్డియను పత్రిక వ్రాస్తోంది. హిందూ ప్రత్యేక విలేఖరి, లండన్‌నుండి, ఇదే తెలియజేస్తున్నాడు. రోమెల్ సైన్యాల దాడి ప్రారంభమయినట్లుకూడా అఖరివార్తలు. అటు కాకాసస్‌నుండి, ఇటు మధ్యప్రాచ్యం నుండి, అక్ష రాజ్యాలు ఇండియా హద్దుకు చొచ్చుకువచ్చే గొప్ప ప్రమాదం సమీపించింది.

చీనా విజయాలు

చీనా సైన్యాలు చూసీన్. లుషియాలను పట్టుకొంది. చూసీన్-జపానుకు 700 మైళ్ళలో వుంది. ఈప్రదేశాలనుండి జపానుపైబాంబులు వేయడానికి వేదికగా యివి ఉపయోగపడతాయి కియాంగ్సీ, చెకియాంగ్ రాష్ట్రాలలో 20 పట్టణాలకు పైగా చైనా చేతికి చిక్కాయి.

అప్పుడే అమెరికను విమానాలు, చైనా తూర్పు భాగంనుండి టోకియోపై బాంబులు వేశాయి కూడ.

సోలోమన్ దీవుల యుద్ధం

ఇటుచీనా విజయాలు, సోలోమన్ దీవులలో అమెరికా దాడి, జపానుకు దెబ్బని వేరే చెప్పనక్కరలేదు. జపాను సైన్యాలు ఈ దీవులలో కొన్ని చోట్లనుండి వెనక్కి పోయాయి. ఇదివరకు కోరల్ సముద్రంలోను. మిడ్వే దీవులలోను జరిగిన అపజయాలతో పాటు ఇది జపానుకు మూడవ అపజయమనిచెప్పవచ్చు. ఇంత మాత్రాన జపాను చొరవ అప్పుడే తగ్గిందని చెప్పడానికి వీలులేదు. జపాను "మిల్నీ బే"లో దిగడం యిది తెలియజేస్తుంది. "మిల్నీబే"లో కూడ జపాను వెనుకముఖం పట్టింది. ఇచ్చట కూడ మిత్రరాజ్యాలకే విజయం సంభవించింది.

ఇట్టి పరిస్థితులలో మనపైకి జపాను రాదని కొందరి వూహ. కాని, జపాన్ ఇండియాపైకి వస్తుందా, సోవియటుపై బడుతుందా అని తర్కించడంఅవివేకం. బర్మా, అస్సాములలో తీవ్ర వర్షకాలం అయిపోవచ్చింది. భారత దేశ అంతర్గత పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయి. జపాను ఏక్షణమైనా మనపై బడవచ్చు.

ఇండియాలో జాతీయైక్యత ఒక్కటే మన దేశాన్ని రక్షించగలదు, ప్రపంచాన్ని రక్షింపగలదు. జాతీయైక్యతా మార్గం, మనదేశానికి కీర్తి, ప్రపంచానికి స్వేచ్ఛ నిస్తుంది. మరో మార్గం, మనకు మృత్యువు, మన దేశానికి శాశ్వత అపకీర్తి తెస్తుంది.— 1—8—42

Published by Katragadda Rajagopala Rao and Printed by The Popular Printers, Governorpet - Bezwada.

END OF ISSUE